సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 12-1-2024 15/-





## నిరసన గళాలు సాధించిన విజయాలు










సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 2 హైదరాబాద్
శుక్రవారం 12 జనవరి 2024 రూ.15-00
29 జమాదిల్ ఆఖిర్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

ఎవరయితే అల్లాహ్ కోసం మస్జిద్ నిర్మిస్తాడో అల్లాహ్ అతని కోసం స్వర్గంలో బ్రహ్మాండమైన భవనం నిర్మిస్తాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...

| | | |
|---|---|---|
| మీడియా | ...... | 04 |
| నిరసన గళాలు సాధించిన విజయాలు | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)-12 | ...... | 08 |
| చరితార్థులు-2 : నవాబ్ సాదత్ అలీ ఖాన్ | ...... | 11 |
| చీకట్లను చీల్చిన జ్ఞాన కిరణం ఫాతిమా షేక్ | ...... | 12 |
| అధికారం ఇచ్చేది ఆయనే | ...... | 14 |
| బిడ్డా ఎప్పుడొస్తవ్....? | ...... | 16 |
| తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| విశ్వాసాలు – విశ్వాసాల వాస్తవికత, ప్రాముఖ్యత | ...... | 20 |
| విశ్వాసానికి చిహ్నం నమాజ్ | ...... | 26 |
| ప్రవక్త (స) వైద్య విధానం | ...... | 28 |
| ప్రతిఘటనలో దైవ సందేశ ప్రచారం | ...... | 30 |
| జనం లెక్కిస్తూనే ఉంటారు జాగ్రత్త! | ...... | 32 |
| రేపు నీది కాదు | ...... | 34 |

**ఇక్కడెవరూ నోరుతెరవద్దు...**




వందమంది ఎంపీల్ని
గెంటారట బయటికి
గొంతెత్తడమే పాపం
పంపారట యింటికి!
ప్రశ్నించే గొంతుకలకు
చోటు లేదు యిక్కడ
ప్రజాస్వామ్య ద్రోహం
జరుగుతోంది అక్కడ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## మీడియా

**ఎన్డీటీవీలో** అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించిన ప్రముఖ పాత్రికేయుడు రవీష్ కుమార్ నవంబర్ 30, 2022వ తేదీన చానలుకు రాజీనామా చేశారు. మొత్తం 27 సంవత్సరాలు ఆయన ఎన్డీటీవీలో పని చేశారు. రవీష్ కుమార్ రాజీనామాకు కారణాలేమిటన్నది చూస్తే ఎన్డీటీవీ యాజమాన్యం మారిపోయింది. ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితులైన వారి చేతుల్లోకి యాజమాన్యం వచ్చింది. రవీష్ కుమార్ స్వేచ్ఛగా తన పని చేసే వాతావరణం లేకుండా పోయింది. దేశంలో పాత్రికేయవిలువలకు ప్రాముఖ్యం ఇచ్చే జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పరిస్థితికి రవీష్ కుమార్ రాజీనామా ఒక ఉదాహరణ.

గోదీ మీడియా అనే పదాన్ని మొదట ఉపయోగించింది రవీష్ కుమార్. పాలకపక్షానికి అనుకూలంగా ప్రచారం చేస్తున్న మీడియాగా ఆయన గోదీ మీడియా అనే పదాన్ని వాడారు. అదే గోదీ మీడియాలో భాగం కాకూడదనే ఆయన ఎన్డీటీవీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత రవీష్ కుమార్ యూట్యూబ్ చానల్ స్వంతంగా ప్రారంభించి అక్కడ మాట్లాడడం మొదలుపెట్టారు. ఎన్డీటీవీ యాజమాన్యం మారక ముందు ఎన్డీటీవీపై ప్రభుత్వం అనేక ఆరోపణలు చేసింది. మనీ లాండరింగ్ మొదలు స్పాన్సర్షిప్ నష్టాల వరకు దాడులు అనేక విధాలుగా జరిగాయి. దేశంలో స్వతంత్ర మీడియా ఎదుర్కొంటున్న సంక్లిష్ట స్థితికి ఇదొక ఉదాహరణ. ఎన్డీటీవీ నుంచి బయటకు వచ్చిన తర్వాత రవీష్ కుమార్ ప్రారంభించిన యూట్యూబ్ చానల్ను లక్షలాది మంది ఆదరించడం ప్రారంభించారు. ఒక్క రవీష్ కుమార్ మాత్రమే కాదు అనేక మంది ప్రముఖ జర్నలిస్టులు తమ చానళ్ళను, వార్తా సంస్థలను వదిలి స్వతంత్ర జర్నలిజం కోసం యూట్యూబ్ను ఆశ్రయించడం ఇప్పుడు ఎక్కువయ్యింది.

ఈ పరిస్థితి ఏం సూచిస్తుంది. వార్తా సంస్థలు, మీడియాపై ప్రభుత్వ ఒత్తిడికి ఇది నిదర్శనంగా చాలా మంది విశ్లేషిస్తున్నారు. నిష్పక్షపాత స్వతంత్ర జర్నలిజం కోసం సోషల్ మీడియా వేదికలను ఆశ్రయించక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. అయితే సోషల్ మీడియాలో ప్రవేశించి తమ గొంతు వినిపించాలనుకుంటున్న ఈ జర్నలిస్టులకు సమస్యలు తక్కువగా లేవు. ఆర్థిక సవాళ్ళు, నిలకడైన ఆదాయం లేకపోవడం, న్యాయపరమైన మద్దతు లభించకపోవడం, ఆన్ లైన్ వేధింపులు, మాత్రమేకాదు భౌతికదాడుల భయాలు కూడా ఉన్నాయి. భారతదేశంలో జర్నలిజం పరిస్థితిని ఎన్డీటీవీ టేక్ ఓవర్ అద్దం పడుతుంది.

ప్రపంచంలోని 180 దేశాల్లో భారతదేశం వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్సు ప్రకారం 161వ స్థానంలో ఉంది. స్వతంత్ర జర్నలిస్టులు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. అనేకమంది ఇప్పుడు యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ద్వారా తమ గొంతు వినిపిస్తున్నారు. ఉద్యోగాలు వదిలేసి బయటకు వచ్చేశారు. చివరకు ఒక పుస్తకం రాయాలన్న జర్నలిస్టు స్వతంత్రంగా రాసే పరిస్థితి ప్రముఖ మీడియా సంస్థల్లో లేదని తెలుస్తోంది. అందువల్లనే చాలా మంది ఉద్యోగాలకు రాజీనామా చేసి సోషల్ మీడియా వేదికగా పనిచేసుకుంటున్నారు. త్వరలో 2024 సాధారణ ఎన్నికలు రాబోతున్నాయి. ఈ ఎన్నికల్లో స్వతంత్ర జర్నలిజం, యూట్యూబ్ వేదికగా పని చేస్తున్న జర్నలిస్టులు ఎలాంటి ప్రభావం చూపిస్తారో వేచి చూడాలి.

అబ్దుల్ వాహెద్



# నిరసన గళాలు సాధించిన విజయాలు



ట్రక్కు డ్రైవర్ల సంఘం చివరకు ఆందోళన విరమించింది. కొత్తగా వచ్చిన భారతీయ న్యాయ సంహితలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి కొత్త నియమనిబంధనలకు వ్యతిరేకంగా ట్రక్కు డ్రైవర్లు ఆందోళన ప్రారంభించారు. జనవరి 2వ తేదీన సమ్మె ప్రారంభమైన రెండవరోజు హోంమంత్రిత్వ శాఖ ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్ పోర్టు కాంగ్రెసుతో చర్చలు జరిపిన తర్వాత ఈ సమ్మె విరమించారు.

ఈ చర్చల్లో ఏం జరిగిందంటే, హిట్ అండ్ రన్ కేసులు అంటే యాక్సిడెంట్ చేసి అక్కడి నుంచి పారిపోయే కేసుల్లో కొత్త చట్టాలు అప్పుడే అమల్లోకి రావని, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్ పోర్టు కాంగ్రెసు ప్రతినిధులతో చర్చలు సంప్రదింపుల తర్వాత మాత్రమే అమలు చేస్తామని ప్రభుత్వం వివరణ ఇచ్చిన తర్వాత సమ్మె విరమించారు.

ఇక్కడ గమనించవలసిన పదాలు "చర్చలు సంప్రదింపులు." అధికారం చేతుల్లో ఉన్నవారు, ఏమైనా చేసేయవచ్చు అనుకునే వారు ఇప్పుడైనా చర్చలకు సంప్రదింపులకు ఉన్న ప్రాధాన్యత గుర్తిస్తారా? దేశంలో చట్టాలు చేస్తున్నప్పుడు చర్చలు సంప్రదింపుల ప్రాముఖ్యాన్ని తెలుసుకుంటారా?

ఇటీవల పార్లమెంటు నుంచి భారీ సంఖ్యలో సభ్యులను బహిష్కరించడం జరిగింది. ఇలా భారీ సంఖ్యలో సభ్యులను బహిష్క

రించిన మరో ఉదాహరణ ఎప్పుడైనా ఉందా? ఇది ప్రజా స్వామ్యమా? పెద్ద సంఖ్యలో సభ్యులు సభలో లేనప్పుడు బిల్లులు ప్రవేశపెట్టి చట్టాలు చేయడానికి తగిన సౌలభ్యం సంపాదించు కున్నారు. చర్చలు సంప్రదింపుల్లేకుండానే చట్టాలు చేయడం సముచితమా? చివరకు ప్రభావిత వర్గాలు ఆందోళనలకు, నిరసనలకు దిగిన తర్వాత చర్చలు సంప్రదింపుల గురించి మాట్లాడక తప్పలేదు.

ఇదంతా ఇలా ఎందుకు జరుగుతోంది? అధికారాలు కేంద్రీకృతం కావడం, సభ్యులను బహిష్కరించి చట్టాలు చేయడం, ప్రచార ప్రసార సాధనాలను ఉపయోగించుకుని మాన్యుఫాక్చరింగ్ కంసెంట్ ప్రక్రియ కొనసాగించడం. ఒకే నాయకుడి చేతుల్లో అధికారాలన్నీ గుప్పిట పెట్టుకునే రాచరిక ధోరణి ఇవే కారణాలు కాదా? కాని ఇలాంటి చట్టాలు చేసినప్పుడు సహజంగానే ప్రభావిత వర్గాలు నిరసనలకు దిగుతాయి. ఈ చట్టాలను సవాలు చేస్తూ, ఈ చట్టాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలియజేయడం సహజ పరిణామం. ఇదంతా జరిగిన తర్వాత మాత్రమే చర్చలు సంప్రదింపుల గురించి మాట్లాడుతున్నారు.

పౌరసమాజం తరఫున నిరసనలు పెల్లుబకడం, ఏదైనా సమస్యకు ప్రతిస్పందనగా ప్రజలు వీధుల్లోకి రావడం, ఉద్యమించడం నేటికి కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి తప్పని పరిస్థితి ఉంది. ఇది గతంలో కూడా చూశాము. పౌరసత్వ సవరణ చట్టం వచ్చినప్పుడు కూడా పెద్ద ఎత్తున నిరసనలు పెల్లుబికాయి. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని, సమాజాన్ని విడగొట్టడానికి, విభజన రాజకీయాలు నడపడానికి చట్టాలు చేస్తే ప్రజలు ఏం చేయాలి? మౌలికమైన రాజ్యాంగ విలువలను, సంప్రదాయాలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా చట్టాలు చేయడానికి పూనుకుంటే ప్రజలు ఏం చేయగలరు?

పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీలు నిజానికి ఇలాంటి పరిస్థితినే సృష్టించాయి. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని, సమాజంలో చిచ్చుపెట్టే రాజకీయాలు వీటి వెనుక ఉన్నాయి. ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగానే షాహిన్ బాగ్ మహిళల ఉద్యమం అంతర్జాతీయ మీడియాను కూడా ఆకర్షించింది. చివరకు ఆ చట్టం మార్గదర్శక నియమనిబంధనలు ఇంతవరకు రూపొందలేదు. ఇటీవల జరిగిన శాసనసభల ఎన్నికల తర్వాత మతతత్వ రాజకీయాలకు మరింత ఊతం లభించడంతో త్వరలో ఈ నియమనిబంధనలను రూపొందించి చట్టాన్ని అమలు చేస్తారనే వార్తలు కూడా వస్తున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావలసి ఉంది. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టానికి సంబంధించిన రూల్సు రూపొందించి అమలు చేయడం కుదరదు కాబట్టి అంతకన్నా ముందే చేస్తారని పలువురు భావిస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో బీజేపీకి చెప్పుకోడానికి రామమందిర నిర్మాణం ఒక్కటే ఉంది. సిఏఏ కూడా అమలు చేస్తే మతతత్వ రాజకీయాలతో మరోసారి గద్దెనెక్కే అవకాశం ఉంటుందన్న ఆలోచన కనిపిస్తోంది. కాని సిఏఏ అమలు విషయంలో రాజకీయంగా కూడా బీజేపీకి సానుకూల పరిస్థితి లేదు. అస్సాంలో చాలా గ్రూపులు సిఏఏను వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే 1985 అస్సాం ఒప్పందానికి ఇది విరుద్ధమని వాదిస్తున్నారు. ఈ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తర్వాత అస్సాంలోకి ప్రవేశించిన బంగ్లాదేశీలందరినీ గుర్తించి వెనక్కు పంపేయాలి. అందుకోసం ఎన్నార్సీ జరిపిం చారు. కాని ఎన్నార్సీపై కూడా చాలా మందికి ఇప్పుడు అభ్యంత రాలున్నాయి. పెద్ద సంఖ్యలో ఎన్నార్సీలో ముస్లిముల పేర్లు ఉంటాయనుకున్నారు. అలా జరగలేదు. ఇప్పుడు మళ్ళీ ఎన్నార్సీ రీ వెరిఫికేషన్ గురించి మాట్లాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నార్సీ గురించి కూడా మాటలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఒక మతసముదాయాన్ని లక్ష్యంగా చేసుకున్న పనులే. ఎన్నార్సీ మళ్ళీ జరిపించాలనే పిటీషన్ సుప్రీంకోర్టులో ఉంది. అస్సాం జనాభా 3 కోట్ల 29 లక్షల మందిలో 19 లక్షల మంది ఎన్నార్సీలో లేరు. ఇందులో దాదాపు ఆరు లక్షల మంది బెంగాలీ మాట్లాడే హిందువులకు సిఏఏ ద్వారా పౌరసత్వం ఇస్తారు. సిఏఏ, ఎన్నార్సీ ఒకదానికి ఒకటి సంబంధించినవి. సిఏఏ ఎన్నార్సీలకు సంబం ధించిన పరిస్థితి ఇది.

సిఏఏ చట్టానికి వ్యతిరేకంగా ఈ చట్టం చేసినప్పుడే 2019లో తీవ్రమైన స్థాయిలో నిరసనలు పెల్లుబికాయి. తర్వాత కరోనా రావడంతో నిరసనలు కరోనా లాక్‌డౌనులోకి వెళ్ళిపోయాయి. కాని ఈ చట్టం అమలు కాకుండా అడ్డుకోగలిగాయి. ప్రజల నిరసన ద్వారా ఆగిపోయిన చట్టాల విషయానికి వస్తే వ్యవసాయ చట్టాల గురించి తప్పక చెప్పుకోవాలి. వ్యవసాయ సంస్కరణలు కోరేవారు కూడా ఈ చట్టాలను తీవ్రంగా వ్యతిరేకించారు. రైతుల ఆదోళన చివరకు ప్రభుత్వం దిగివచ్చేలా చేసింది. ఈ చట్టాలను చేస్తున్నప్పుడు కూడా ప్రభుత్వం ఎవరిని సంప్రదించలేదు. ఈ బలవంతపు చట్టాలపై రైతులు సాగించిన పోరాటం గమనించ దగింది. సిఏఏ చట్టానికి వ్యతిరేకంగా ముఖ్యంగా ముస్లిములు నిరసనలు తెలిపితే, రైతు చట్టాలకు వ్యతిరేకంగా ముఖ్యంగా శిక్కులు నిరసనలకు దిగారు. అయితే జాట్ తదితర వర్గాల

రైతులు కూడా ఈ నిరసనల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. జాతికుల మతాలకు అతీతంగా ఈ ఉద్యమం నడిచింది. లఖింపూర్ లో జరిగిన సంఘటన తర్వాత ఉత్తరప్రదేశ్ కు చెందిన రైతులు కూడా ఈ నిరసనల్లో పాలుపంచుకున్నారు. ఈ నిరసనలు సుదీర్ఘకాలం కొనసాగాయి. ఈ వ్యవసాయ చట్టాలను చేస్తున్నప్పుడు కూడా మోడీ ప్రభుత్వం ఎవరినీ సంప్రదించలేదు. రైతు సంఘాలను, రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్నవారిని ఎవరినీ సంప్రదించలేదు. నిజానికి ఎవరినీ సంప్రదించకుండా చట్టాలు చేసి ప్రజలపై రుద్దడం అన్నది వలసపాలకుల లక్షణం. బ్రిటీషు వారు ఇలాగే చట్టాలు చేసేవారు.

రైతు నిరసనలకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభించింది. మహిళలు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సోషల్ మీడియాలోను ఉధృతంగా ప్రచారం జరిగింది. రాజకీయాలకు అతీతంగా ఉద్యమాన్ని నడిపించారు. పెద్ద వయసు మహిళలు కూడా ట్రాక్టర్లు నడుపుతూ ఈ ఉద్యమంలోకి వచ్చారు. లంగర్ కిచెన్లలో పాల్గొన్నారు. వేదికలెక్కి ప్రసంగాలు చేశారు. పొలాల్లో దుక్కి దున్నడమే కాదు వేదికలెక్కి ఉద్యమాలు నడపగలమని కూడా రుజువు చేశారు. వారు తమ భవిష్యత్తు కోసం నడుంకట్టి రంగంలోకి దిగారు. 1928లో బర్డోలీలో రైతుల సత్యాగ్రహాన్ని గుర్తుకు తెచ్చారు. సల్వార్ కమీజులు, పసుపు దుప్పట్టలతో ఒక సమైక్య శంఖారావం వినిపించారు.

ఇలా ఇష్టారాజ్యంగా బలవంతంగా చట్టాలు చేయడం అన్ని సందర్భాల్లోను సాధ్యం కాదని అనేకసార్లు రుజువయ్యింది. నల్లచట్టాలపై ప్రజలు అనేకసార్లు ఉద్యమించారు. ప్రత్యేక సముదాయాన్ని లక్ష్యంగా చేసుకుని చేసే చట్టాలు ప్రజల్లో, సమాజంలో విభజనను రాజేస్తాయి. ఈ వాస్తవాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా ఇండియా కూటమి పేరుతో ఒక్కటవుతున్న ప్రతిపక్షాలు గుర్తించడం ఎంతో అవసరం. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో నిరసనల స్వభావాన్ని అర్థం చేసుకుని ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తమ విధి విధానాలను రూపొందించుకోవాలి.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, పెద్ద సంఖ్యలో పార్లమెంటు సభ్యులను బహిష్కరించిన సంఘటన చాలా పెద్ద సంఘటన. ఇంత పెద్ద సంఖ్యలో పార్లమెంటు సభ్యులు బహిష్కారానికి గురికావడమంటే, దేశంలోని ఓటర్లలో పెద్ద సంఖ్యలో ఓటర్లకు తమ ప్రతినిధులు పార్లమెంటులో లేని పరిస్థితి. కాని ఈ సంఘటనపై ప్రజలు ప్రతిస్పందించిన దాఖలా లేదు. నిరసన స్వరాలు వినిపించిన దాఖలా లేదు. ప్రతిపక్ష ఎంపీలు నిరసనలు చెప్పడమే తప్ప ప్రజల్లో ఆ ప్రతిఘటన, ఆందోళన, నిరసన కనిపించలేదు. కేవలం సోషల్ మీడియాలో వీరంగాలు మాత్రమే కనిపించాయి.

దేశంలో ఇప్పటి వరకు సంచలనాత్మకంగా కొనసాగిన నిరసన ప్రదర్శనల నుంచి ప్రతిపక్షాలు నేర్చుకోవలసిన గుణపాఠాలేమైనా ఉన్నాయా? నిరంకుశ చట్టాలకు వ్యతిరేకంగా గళమెత్తి రోడ్లపైకి వచ్చిన ప్రజలు తమ ప్రతినిధులు పార్లమెంటు నుంచి గెంటివేతకు గురైతే ఎందుకు పెదవి విప్పడం లేదు?

అమెరికాలో బ్లాక్ లివ్స్ మ్యాటర్ ఉద్యమం సంచలనాన్ని సృష్టించింది. ఇప్పుడు ఈ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. ఇది ప్రజలకు ఉన్న బలం. ప్రజాగళం నిరంకుశ పాలకులను కూడా వెనుకడుగు వేసేలా చేస్తుంది. 1970లో చిప్కో ఉద్యమం, ఇటీవలి అన్నాహజారే ఉద్యమం ఈ ఉద్యమాలు ప్రజాబలం ఎలాంటిదో చాటి చెప్పాయి. నిర్భయ దుర్ఘటన తర్వాత ప్రజా ఉద్యమం కొత్త చట్టం వచ్చేలా చేసింది. ఈ ప్రజాబలాన్ని కూడగట్టుకునే ప్రయత్నం ఇండియా కూటమి నేతలు చేయకపోతే రాజకీయంగా తమ ఉనికిని చాటి చెప్పలేరు. ముఖ్యంగా మళ్ళీ బలం పుంజుకోవాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెసు పార్టీ నేతలు ఆలోచించవలసిన విషయాలు చాలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో, రాజస్థాన్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో ఓటమికి దారితీసిన కారణాలేమిటో? సాఫ్ట్ హిందుత్వ రాజకీయాల వల్ల ఏం సాధించారో? ఆలోచించుకోవాలి. సెక్యులర్ పార్టీగా చెప్పుకుంటున్నప్పుడు సెక్యులర్ విలువల కోసం బలంగా నిలబడి చూపించాలి. ఇవన్నీ చేయలేనప్పుడు కేవలం భారత్ జోడో యాత్రలు, ముహబ్బత్ కా దుకాన్ నినాదాలను, కుల జనగణన గురించి చెప్పే మాటలను ప్రజలు నమ్మడం చాలా కష్టం. ప్రజల్లో నమ్మకం లేదు కాబట్టే ఇంతమంది ఎంపీలు బహిష్కరణకు గురైనా ప్రజల్లో నిరసన వ్యక్తం కాలేదన్నది నిజం. ✤


గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

అధ్యాయం -4

12

# నిర్ధారణాగ్రేసరుడు

# మహనీయ అబూ బక్ర్ (రజి)

## ఎస్.ఎమ్. మలిక్

### మొదటి ఖలీఫా ప్రత్యేకతలు

ఆయన సూక్తి : "సత్యం అప్పగింత వంటిది, అసత్యం ద్రోహం వంటిది."

ఖలీఫా అబూ బక్ర్ (ర) ఇస్లామ్‌కు పూర్వమే సారాయిని ముట్టుకో లేదు. ఎందుకు? అని ఎవరో అడిగారు. దానికి ఆయన, "దైవం రక్షించుగాక! నేను నా మర్యాదను గౌరవాన్ని ఛిన్నాభిన్నం కాకుండా రక్షించుకోవాలని కోరుకున్నాను, సారాయి త్రాగే వ్యక్తి నైతికత, ప్రతిష్ట మంట కలిసిపోతాయి" అన్నారు.

ఆయన ఇస్లామ్‌కు పూర్వం కూడా విగ్రహాలను పూజించ లేదు. కారణం అడిగితే, "నాకు విగ్రహాలంటే వెగటు కలిగేది. ఒకసారి మా నాన్న నన్ను ఓ దేవస్థానంలో వదలి పెట్టి పోయారు. కాస్సేపు అయిన తరువాత నేను ఓ విగ్రహానికి చేరువన పోయి, 'నాకు ఆకలి వేస్తోంది అన్నం పెట్టు' అని అడిగాను. అదేమీ పలకలేదు. ఓ రాయి తీసుకుని దాన్ని కొట్టాను అది బోర్లా పడిపోయింది" అన్నారాయన!

ఒకసారి మానవ సహజమైన దౌర్బల్యం కారణంగా ఓ సహచర మాన్యులతో మహనీయ అబూ బక్ర్ కరకుగా మాటలాడారు. ఆ వ్యవహారం ప్రవక్త శ్రీ(స) దృష్టికి తీసుకురాబడింది. అంతా విన్న మీదట ఆయన ఇలా అన్నారు, "దైవం నన్ను మీ వద్దకు పంపగా అందరూ నేను అబద్ధం చెబుతున్నానని అంటే అబూ బక్ర్ సిద్దీక్, 'కాదు, మీరు పలికేది సత్యం' అని ధ్రువీకరించారు. ఆ తరువాత ఆయన ధన ప్రాణాలతో నాకు తోడుగా నిలిచారు. అయితే మీరు నా కొరకు నా ఈ సహచరునికి బాధ కలిగించడం మానుకోలేరా?"

మహనీయ అలీ తన ఖిలాఫత్ కాలంలో ప్రసంగిస్తూ జనుల్ని అడిగారు, అందరికన్నా శౌర్యవంతుడు ఎవరు అని. దానికి జనులు, "అమీరుల్ మూ'మినీన్! మీరే అందరి కన్నా శౌర్య వంతులు" అని బదులిచ్చారు. అప్పుడు మహనీయ అలీ (ర) ఇలా నుడివారు,

"నాకు ఎవరయినా ఛాలెంజ్ చేస్తే నేను అప్పుడు మార్కొంటాను. కాని అబూ బక్ర్ అలా కాదు, మిగతా గుణగణాలే కాక శౌర్యం లోనూ అందరికన్నా ముందుండేవారాయన. మేము ఓ పోరాటంలో ప్రవక్త మహనీయుల కొరకు ఓ గుడారం వేసి, ప్రవక్తశ్రీ పైన శత్రువులు దాడి చేసే సాహసం చేయకుండా రక్షణ బాధ్యత ఎవరు తీసుకుంటారు? అని ప్రశ్నించుకుంటే, దైవం మీద ఒట్టు, కేవలం అబూ బక్ర్ ఒక్కరే తన కరవాలం తీసుకుని ముందుకు వచ్చిన వారు. అలాగే ఆయన ప్రవక్త శ్రీ (స) వైపునకు ఎవరు వచ్చినా అతని మీద లంఘించేవారు. నిస్సందేహంగా ఆయనే శౌర్యవంతులు."

ఆ తరువాత ఆయన ఇంకా ఇలా అన్నారు,"ఒక రోజు మక్కాలో ఖురైష్ తిరస్కారులు ప్రవక్త మహనీయులను చుట్టుముట్టి ఒకడు కొడుతుంటే మరొకడు విదిలిస్తున్నాడు. వారంతా గొంతు చించు కుంటూ, 'సకల ఆరాధ్యులకు బదులుగా వారి స్థానంలో ఒకే దైవాన్ని ఆరాధించమంటావా?' అని తమ క్రోధాన్ని వెళ్ళగ్రక్కు తున్నారు. దైవం మీద ఒట్టు! ఆ సమయంలో ఒక్క అబూ బక్ర్ తప్ప మరెవరూ ముందుకు రాలేదు. ఆయన అందరినీ చీల్చి చెండాడారు. ఒకరిని త్రోసివేస్తే, మరొకరిని లాగికొట్టారు, ఇంకొకరి చొక్కాపట్టుకుని తొలగించారు. అప్పుడు ఆయన ఇలా

పలుకుతుండేవారు, "మీరు నాశనం అవుదురు గాక, నా ప్రభువు దైవం ఒక్కడే అని చెప్పే వ్యక్తిని మీరు కొడుతున్నారా?"

ఆ పైన మహనీయ అలీ (ర) తన పైని దుప్పటి తొలిగించుకుని సముదాయించలేని విధంగా రోదించ సాగారు. ఆయన గడ్డం కన్నీటితో తడిసి పోయింది. అప్పుడు కాస్త తేరుకొని అడిగారు, "ఇక చెప్పండి, దైవం మీద ఒట్టు! ఫిర్ఔన్ జాతిలో విశ్వసించిన ఆ వ్యక్తి ఉత్తముడా లేదా మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ గొప్ప వారా?"

అందరూ మౌనం వహించారు. తిరిగి ఆయనే చెప్ప సాగారు, "దైవం మీద ఒట్టు! మహనీయ అబూబక్ర్ సిద్దీక్ గారి జీవితం లోని ఒక్క క్షణం ఫిర్ఔన్ సంతతిలోని విశ్వాసి జీవితం మొత్తం కన్నా ఉత్తమమయింది. ఆ వ్యక్తి తన విశ్వాసాన్ని దాచి పెట్టాడు మరి అబూ బక్ర్ ఏమో తన విశ్వాసాన్ని బహిరంగంగా ఢంకా బజాయించి మరీ ప్రకటించారు".

ప్రవక్త శ్రీ (స) పట్ల అబూ బక్ర్ సిద్దీక్ (ర) శ్రద్ధాసక్తులు అత్యంత సున్నితమయినవి. ఆ కారణంగానే హిజ్రత్ ప్రయాణంలో ప్రవక్త శ్రీ (స)కి ఎవరయినా హాని కలిగిస్తాడన్న ఆశంక ఆయన్ని సదా వెంటాడుతూ ఉండేది. అందుకే ఆయన ఒక్కోసారి ప్రవక్త శ్రీ కి ముందుగానూ మరొకసారి వెనకగానూ నడిచేవారు. దాన్ని గురించి అడిగినప్పుడు ఇలా చెప్పారు, "దైవప్రవక్తా! నాకు ముందు నుంచి ప్రమాదం అగుపిస్తే ముందుకు వస్తాను, మరి ప్రమాదం వెనుక ఉంటుందన్న అనుమానం కలిగితే వెనక నుంటాను."

మహనీయ ఉమర్ ఫారూక్ ఒకసారి ప్రసంగిస్తూ ఇలా చెప్పారు, "మేము తబూక్‌కు పయనం అవుతున్న రోజులు నిండు వేసవి. ప్రయాణంలో ఒకచోట క్యాంపు వేశాము. మా వద్ద నీరు అయి పోయింది. ఇక తుది ఘడియలు సమీపించాయేమో అనిపించ సాగింది. మాలో కొందరు దప్పిక తీర్చుకునేందుకు ఒంటెల్ని జిబహ్ చేసి అందులోని నీటి సంచి తీసి త్రాగినంత త్రాగి మిగతా ఏదో విధంగా దాచి పెట్టుకున్నారు. ఆ పరిస్థితుల్లో మహనీయ అబూ బక్ర్ (ర) దైవ ప్రవక్త సన్నిధిలోకి వెళ్ళి నివేదించుకున్నారు,

"దైవ ప్రవక్తా! నిశ్చయంగా దైవం మీ ప్రార్థనను ఆలకించి అంగీక రిస్తాడు. శుభాలను, వృద్ధినీ అనుగ్రహిస్తాడు. మీరు మా కొరకు దైవాన్ని వేడుకోండి."

దైవప్రవక్త అడిగారు, "నిజంగా మీరు దీన్ని కోరుకుంటున్నారా?" అని. దానికి అబూ బక్ర్ అవునని సమాధానమిచ్చారు.

కాగా ఆయన(స) చేతులెత్తి వేడుకోసాగారు. ఇంకా ఎత్తిన చేతులు దించక ముందే ఆకాశంలో గర్జన వినవచ్చింది. ఆ తరువాత మామూలు చినుకులతో మొదలయి కుండపోతగా వాన కురిసింది. సహచర మాన్యులందరూ తమ వద్ద ఉన్న పాత్రలన్నీ నింపుకున్నారు. మేము చుట్టూత కలయ చూశాము, మా సైన్యం నిలిచిన ప్రాంతం తప్ప మరెక్కడా వర్షం కురియ లేదు.

అప్పుడప్పుడు ప్రవక్త శ్రీ (స), మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ (ర), దైవ ధర్మం ఇస్లామ్ కొరకు అందజేసిన సేవలను గురించి తన సహచర మాన్యులకు తెలియపరుస్తూ ఉండేవారు. ఒక సందర్భంలో ఇలా పురమాయించారు.

"నాకు అందరి కన్నా అధికంగా, అబూ బక్ర్ తన సహచర్యం, సొమ్ముతో కృతజ్ఞుణ్ణిగా చేసి పెట్టారు. నేను నా ప్రభువు తప్ప మరెవరినయినా నా పరమ మిత్రునిగా (ఖలీల్‌గా) చేసుకోదలిస్తే అబూ బక్ర్‌ని చేసుకునే వాణ్ణి! కాని మా ఇరువురి మధ్య సంబంధం ఇస్లామీయ సోదరత్వం, ప్రేమ సంబంధం, అదే చాలు!! మస్జిద్ ప్రాంగణంలోకి తెరచుకునే ద్వారాలన్నీ మూసి వేయవలసిందే, అయితే అబూ బక్ర్ ఇంటి ద్వారం తెరిచి ఉంచండి."

(ప్రవక్త శ్రీ మస్జిద్‌కు పశ్చిమాన, బాబుస్సలామ్‌తోపాటు ఉన్న ద్వారం మహనీయ అబూ బక్ర్ (ర) ఇంటి ద్వారం.)

## పండుగ రోజు

ఒకసారి పండుగ రోజులలో మహనీయ అబూ బక్ర్ (ర) తన కూతురు మహనీయ ఆయిషా ఇంటికి వెళ్ళారు. ఆ సమయాన అన్సారుల అమ్మాయిలు కొందరు కూచొని రాగయుక్తంగా కొన్ని కవితలు పాడుతున్నారు. ఇది వినగానే అబూ బక్ర్, "ఏమిటీ, దైవ ప్రవక్త ఇంట షైతాన్ వాయిద్యాలు వాయిస్తారా?" అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) అమ్మాయిలకు విముఖులయి కూర్చొని ఉన్నారు. ఆయన (స) అబూ బక్ర్‌కు చెప్పారు,

"అబూ బక్ర్! వారిని పాడుకోనివ్వు, ప్రతి జాతికి ఓ పండుగ ఉంటుంది, ఇది మన పండుగ రోజు!"

## తొలి బైతుల్ మాల్ (ప్రభుత్వ ధనాగారం)

ఖలీఫా అబూ బక్ర్ (ర) తన ప్రభుత్వ ధనాగారం తాను నివసిస్తూ ఉన్న ఇంటి వద్ద 'సునహ్' అనే చోట ఏర్పరచుకున్నారు. దానికి ప్రత్యేక తాళం ఉందని పురమాయించేవారు ఆయన. అప్పటి వరకు ప్రభుత్వానికి అందే ధనం ఏదయినా దాన్ని అప్పటికప్పుడు అగత్యపరుల్లో పంచి పెట్టడం జరిగేది. తరువాత ఆయన మహానగరం మదీనాకు తన బస మార్చవలసి వచ్చినప్పుడు ధనాగారాన్ని సయితం రాజధానికి మార్చుకున్నారు.

ఆ తరువాత ప్రభుత్వ అవసరార్థం ధనం కావలసి వచ్చినప్పుడు, ఇంకా వేర్వేరు రుతువుల్లో ప్రజల విభిన్న అవసరాలకు ధనం అవసరమయినప్పుడు, సంపద కూడబెట్టి అవసరం మేరకు ఖర్చు పెట్టేవారు. ఆయన కాలంలో ఎటువంటి రాబడి లేని నిరుపేద ప్రజల అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వమే నిర్వహించేది. బైతుల్ మాల్ ద్వారా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని నిత్యం ప్రభుత్వ యంత్రాంగాన్ని జాగరూక పరుస్తూ ఉండే వారాయన.

దైవ మార్గంలో ప్రతి మానవ ప్రాణి వరకు దైవ ధర్మ సందేశాన్ని చేరవేయడం ముస్లిమ్ సముదాయం ప్రధాన కర్తవ్యం కావటాన ఆయన ఈ సంఘటిత కృషి కొరకు ముస్లిమ్ సముదాయంలోని

సకల శక్తుల్ని సమాయత్త పరిచారు. తద్వారా బాధిత, పీడిత ప్రజల పైన జరిగే అన్యాయం, అక్రమం, దౌర్జన్యం అంతమవ్వాలని, వారు, సత్య సందేశాన్ని నిర్భయంగా అర్థం చేసుకోవాలని, దాస్య జనం, పీడిత బానిస జనం, స్వేచ్ఛ ననుభవించాలని, సత్య ధర్మం సకల ప్రతిఘటనల్ని దాటుకుంటూ ప్రపంచంలో మూలమూలలకు చేరాలని ఉద్దేశించడం జరిగింది. ఆ కర్తవ్య నిర్వహణ కొరకు ధనాగార ద్వారాలు సదా తెరిచే ఉండేవి.

## ఆయన వ్యక్తిగత జీవితం

ఖలీఫా అబూ బక్ర్ సిద్దీక్ (ర) మదీనా వచ్చిన కొత్తలో తన జీవిక కోసం కొంత కాలం తన వృత్తి, వ్యాపారం చేసుకునేవారు. ఆ తరువాత మదీనా పరిసరాల్లో 'సునహ్' అనే గ్రామంలో అతి సాధారణమయిన, పల్లె పట్టున ఉండే ఓ చిన్న ఇల్లు కట్టుకున్నారు. ఖలీఫాగా ఎన్నికయిన తరువాత కూడా ఆరు నెలల వరకు ఆయన ఆ ఇంటిలోనే గడిపారు. ఖలీఫా బాధ్యతలు నిర్వర్తించడానికి రోజూ మదీనాకు వస్తూ పోతూ ఉండేవారు. ప్రవక్త మస్జిద్‌లోనే ప్రభుత్వ కార్యాలయం కావడం చేత తన బాధ్యతలు, కార్యకలాపాలు అక్కడి నుండే నడిపించే వారు.

ఈ కారణాల వల్ల మదీనా నగరానికి రావడం అనివార్యమయి సునహ్ నుంచి ఓ చిన్న ఇంటికి తరలి వచ్చారు. ఇది హిజ్రత్ చేసి మదీనా వచ్చినప్పుడు దొరికిన చిన్న ఇల్లు. దీన్ని కూడా ఆయన ఖలీఫాగా ఎటువంటి మార్పులు చేయకుండా యధాతథంగా వాడుకున్నారు.

ఒకసారి మహనీయ ఖలీఫా అబూ బక్ర్ సిద్దీక్ (ర) ఇలా ప్రకటించవలసి వచ్చింది. "నా జాతి ప్రజలకు బాగా తెలుసు, నా వృత్తి ద్వారా కలిగే ఆదాయం నా ఇంటి ఖర్చులకుగాను సరిపోయేది, కాని ఇప్పుడు నేను ముస్లిముల వ్యవహారాలకు కాపలాదారునిగా నియుక్తుణ్ణయి వారి కార్యకలాపాలలో మగ్నమయి పోయాను, నా వ్యాపారం చేసుకోలేకపోతున్నాను. అందువల్ల అబూ బక్ర్ కుటుంబం ముస్లిముల ధనాగారం నుండి సొమ్ము గ్రహించి తమ అవసర ఖర్చులు పూర్తి చేసుకోవలసి ఉంటుంది".

మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ (ర) ఖలీఫా కాక పూర్వం తానుండే చోటున ఓ అనాథ కుటుంబం మేకల పాలు పిండి వారికి అప్పజెప్పి మరీ వచ్చేవారు. ఖలీఫా అయిన తరువాత ఆ కుటుంబంలోని ఓ అమ్మాయి, "ఇకనయితే మీరు మా మేకల పాలు పిండి ఇవ్వ లేరు కదూ?" అన్నది. దానికి ఆయన, దైవం మీద ఒట్టు! నేను ఈ సేవను అందజేస్తూ ఉంటాను, నా కొత్త బాధ్యతలు నన్ను నా గత సత్కార్యాల నుండి వంచితుణ్ణి చేయవని ఆశిస్తున్నాను" అని పలికారు.

అలాగే ఆయన మునుపటి లానే వాళ్ళ మేకల పాలు పిండి ఇవ్వడం మానుకోలేదు. ఆ అమ్మాయిలు తమ మేకల్ని తీసుకు వస్తే, చిలిపిగా "నురుగు వచ్చేలా పిండనా వద్దా?" అని అడిగేవారు. వారు నురుగు వద్దు అంటే పాత్ర కాస్త దూరం ఉంచి పాలు పిండేవారు. నురుగు కావాలని అంటే పాత్ర దగ్గర ఉంచి పిండేవారు! ఖలీఫా అయిన తరువాత కూడా ఆయన అక్కడ ఉన్నంత కాలం, ఆరు (6)నెలలు ఈ సేవలు అందజేస్తూ ఉండేవారు.

మహనీయ అబూ సాలిహ్ గిఫారీ (ర) ప్రకారం, మదీనా నగరంలో ఓ కబోది ముసలి మహిళ ఉండేది. మహనీయ ఉమర్ (ర) రాత్రి వేళల్లో ఆమె అవసరాలు తీర్చేందుకు వెళ్ళేవారు. ఆమెకు అవసరమయిన సరకు, నీళ్ళు తెచ్చి పెట్టే వారు. తరుచుగా తాను ఆమె వద్దకు వెళ్ళేముందే ఎవరో వచ్చి ఆమె అవసరాలు తీర్చి సేవలొనర్చి వెళ్ళారని తెలిసేది. అనేక పర్యాయాలు మహనీయ ఉమర్ త్వరగా వచ్చి మరోవ్యక్తి రాక ముందే వెళ్ళాలని ప్రయత్నించినా అలా చేయలేకపోయారు. ఓ రోజు రాత్రి దాగుండి చూశారాయన, ఆ ముసలమ్మ సేవలు తనకన్నా ముందు చేసి వేసే ఆ పెద్ద మనిషి మరెవరో కారు, మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ గారే అని బయట పడింది, వాస్తవానికి అప్పుడు ఆయన ముస్లిముల ఖలీఫాగా అలరారే వారు!

మహనీయ అబూ బక్ర్(ర)కు సమకాలీన రాజకీయ పరిస్థితులను గురించిన పరిజ్ఞానం క్షుణ్ణంగా ఉండేది. సమకాలీన రాజ్యాల చట్టాలు సయితమూ ఆయన బాగా ఎరిగిన వారే. ఆ కాలంలో ప్రజాస్వామ్యం బహుదూరపు విషయం, కనీసం పాలకుడయినా ప్రజల చేత ఎన్నికయిన వ్యక్తి కాడు. రాజ్యాలన్నీ కఱ్ఱ గలవానిదే బఱ్ఱె అన్న చందాన ఏర్పడినవే. రోమా, పర్షియా రెండు అగ్ర రాజ్యాలు. వాటి సమక్షాన తలెత్తే ధైర్యం ఎవ్వరికీ ఉండేది కాదు. రాజకీయ వ్యవస్థ అంతా పాలకులు,పాలితులు అన్న రెండు వర్గాలలో విభజించబడి ఉండేది. రాజ్యంలో ఒక్కొక్క పౌరుణ్ణి పాలక వర్గం వారు శూద్రునిగా, అంటరాని వానిగా చేసి పెట్టారు.

ప్రజల చేత ఎన్నికయిన ఖలీఫా అబూ బక్ర్(ర) ఖిలాఫత్ కాలంలో ప్రపంచంలోని ఈ రెండు అగ్ర రాజ్యాల ఏ ఏ ప్రాంతాలు ముస్లిములు వశపరచుకున్నారో అక్కడల్లా మానవుల మధ్య పరిపూర్ణ సమానత్వం నెలకొల్పడం జరిగింది. ఖలీఫా పక్షాన సేనాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు, మతం, కులం, వర్గం, ఏ తారతమ్యాన్నీ పాటించకుండా అందరి ఎడల సమాన వ్యవహారం పాటించాలి, ఎవరి చేతనూ వెట్టి చాకిరి చేయించరాదు, ఎవరినయినా పరాజితుడనీ, పాలితుడనీ బాధలకు గురి చేయరాదు, చిన్న, పెద్ద సకల వర్గాల ప్రజల ఎడల న్యాయంగా వ్యవహరించాలి. ఏ జాతి ఆరాధనాలయాన్నీ నష్ట పరచరాదు. మతపరమయిన, సామాజికమయిన స్వేచ్ఛను బహిరంగంగా ప్రకటించాలి అని.

పరాజిత ప్రాంతాల ప్రజలు సమానత్వం అంటే ఏమిటో కూడా ఎరుగరు, వారు ముస్లిముల ఈ ఉదార వ్యవహారశైలి వల్ల బాగా ప్రభావితులయ్యారు, వారి మాటతీరు పట్లనూ ఎంతో సంతోషపడ్డారు. అనేక మంది వారి ఈ వ్యవహార శైలి వల్లనే ప్రభావితులయి ముస్లిములయ్యారు! ■


## ‘చరితార్థులు’-2



# నవాబ్ సాదత్ అలీ ఖాన్

## (1822-1874)

30




**మాతృభూమిని** క్రమంగా ఆక్రమించుకుంటూ ముందుకు చొచ్చుక వస్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల పరాజయం లక్ష్యంగా ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ యోధులు నవాబ్ సాదత్ అలీ ఖాన్ పోరాడారు. ఆయన రాజస్థాన్‌కు చెందిన అల్వార్ లోని యుద్ధవీరుల కుటుంబంలో 1822 ఫిబ్రవరి 22న జన్మించారు. ఆయన పూర్వీకులు ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌కు చెందిన హోల్‌కర్స్ రాజవంశీకుల సైన్యంలో వీరయోధులుగా పేర్గాంచారు. యుద్ధ విద్యలందు ఆరితేరిన సాదత్‌ఖాన్ కూడా తమ పూర్వీకుల్లా హోలకార్స్ రాజుల సైన్యంలో అశ్విక దళం బాధ్యతలు చేపట్టారు. స్వదేశీయుల మీద ఆంగ్లేయుల పెత్తనాన్ని సహించలేకున్న సాదత్ ఖాన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ నుండి స్వదేశీ సైనిక యోధులు పూరించిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ శంఖారావంతో ఉత్తేజితులయ్యారు. మహారాజా తూకోజీరావు హోల్‌కర్ అభీష్టానికి వ్యతిరేకంగా తన సహచరులు భగీరత్ సిలావత్, వంషగోపాల్, హరిసింగ్, దుర్గాప్రసాద్, వసీం ముహమ్మద్, దేవిసింగ్ ల సమైక్య సైన్యంతో 1857 జూలై ఒకటిన ఆంగ్లేయుల రెసిడెన్సీ మీద విరుచుకుపడ్డారు. ఆ యోధుల విజృంభణను ఊహించని ఆంగ్లేయాధికారులు పలాయనం చిత్తగించారు. ఆ తరువాత మహారాజు అనుమతితో తమ బలగాలను తోడ్కొని ఢిల్లీలో బహదూర్ షా జఫర్ నాయకత్వంలో సాగుతున్న పోరాటానికి బలం చేకూర్చడానికి బయలుదేరారు. ఆ మార్గమధ్యంలో సాదత్ ఖాన్ సోదరుడు సర్దార్‌ఖాన్ కూడా తన బలగాలతో వచ్చిచేరారు. స్వదేశీ సైనిక యోధులు ఆగ్రా చేరుకునే సరికి ఢిల్లీ ఎర్రకోట ఆంగ్లేయుల వశమైన దుర్వార్త అందింది. ఆ కారణంగా నవాబ్ సాదత్ ఖాన్ బృందం తిరిగి ఇండోర్‌కు ఆఘమేఘాల మీద చేరుకుంది. ఈలోగా ఆంగ్లేయాధికారులు భారీసైన్యంతో ఇండోర్ చేరుకోగా ఇరు పక్షాల మధ్య యుద్ధం సాగింది. స్వదేశీ సైనిక యోధులు ఎంతగా సాహసించి పోరాడినా ఫలితం దక్కలేదు. సహచరుల సలహామేరకు యుద్ధక్షేత్రం నుండి సాదత్ ఖాన్ తప్పుకున్నారు. ఆయనను పట్టి తెచ్చినవారికి ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం ఐదు వేల రూపాయల నజరానా ప్రకటించింది. నవాబ్ సాదత్ ఖాన్ పలు ప్రాంతాలు పర్యటిస్తూ ఆంగ్లేయులకు పట్టుబడకుండా 17 ఏండ్ల పాటు ఆంగ్లేయులను ముప్పుతిప్పలు పెట్టారు. చివరకు 1874 జనవరిలో రాజస్థాన్ లోని బన్సవారా అడవుల్లో ఆంగ్ల సైన్యాలు ఆయనను నిర్బంధించాయి. అనంతరం ఆంగ్లేయాధికారులు విచారణ జరిపి 1874 సెప్టంబర్ ఏడున ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించారు. నవాబుకు ఉరిశిక్ష విధించడానికి ఇండోర్‌లో ప్రజా సమూహం సమక్షంలో ఏర్పాట్లు జరిగాయి. 1874 అక్టోబర్ ఒకటిన ఉరిశిక్ష వేదిక ప్రాంతానికి విచ్చేసి రోదిస్తున్న జన సమూహాలకు నవ్వుతూ అభివాదం చేస్తూ, ప్రజల నుండి జోహార్లు అందుకుంటూ చెట్టుకు ఏర్పాటు చేసిన ఉరిని స్వయంగా ధరించి నవాబ్ సాదత్ అలీ ఖాన్ అమరులయ్యారు. ■




9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




**ప్రాచీన కాలంలో** విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేది. కేవలం అగ్రకులాల వాళ్ళు మాత్రమే విద్యాభ్యాసం చేయడానికి అర్హులుగా పరిగణించబడేవారు. మిగతా వారెవరూ చదువుకు అర్హులు కారు. శూద్రులు, దళితులు, మహిళలు విద్య నేర్చుకోవడం నేరం, పాపం. సనాతన మతసాంప్రదాయంలో శూద్రులెవరైనా వేదం విన్నా, ఉచ్చరించినా కఠిన శిక్షలు విధించేవారట. అలాంటి అజ్ఞాన కాలంలో విద్యావ్యాప్తి కోసం అనేకమంది సంస్కర్తలు కృషిచేశారు. విద్యను సర్వసామాన్యం చెయ్యడానికి అలుపెరుగని ప్రయత్నం చేశారు. అగ్రవర్ణ సమాజం నుండి ఎన్ని అవమానాలు, ఎన్ని బెదిరింపులు, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో సమాజ సంస్కరణ కోసం పాటుపడ్డారు. అలాంటి వారిలో ఫాతిమా షేక్ ఒకరు. ఈమె సావిత్రీబాయి స్నేహితురాలు, సహోద్యోగి. భర్త సహకారంతో సావిత్రీబాయి, సోదరుని సహకారంతో ఫాతిమా విద్యార్జన చేశారు. సావిత్రి బాయితో కలిసి జ్యోతీరావు పూలే దగ్గరే ఆమె చదువు నేర్చుకున్నారు. సోదరుడు ఉస్మాన్ షేక్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులూ అభ్యసించారు. సోదరుని సహకారంతోనే విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు వారికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నారు. తమ హవేలీనే పాఠశాల నిర్వహణకోసం పూలే దంపతులకు వితరణగా ఇచ్చి అండగా నిలిచారు. సావిత్రీ బాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా విద్యావ్యాప్తిలో కీలక పాత్ర పోషించారు. 1851లో ఆమె స్వయంగా ముంబైలో రెండు పాఠశాలలు స్థాపించారు. దళితుల ఇళ్ళకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారు. గంటలు గంటలు సమయం వెచ్చించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు విద్య ఆవశ్యకతను వివరించి వారిలో జ్ఞాన జ్యోతులు వెలిగించారు. ఆరోజుల్లో సనాతన మనువాదులు మహిళా విద్యను నిర్ద్వందంగా వ్యతిరేకించేవారు. రకరకాలుగా వేధించేవారు. అవమానాలకు, ఛీత్కరింపులకు గురిచేసేవారు. బెదిరింపులకు పాల్పడేవారు. అయినా ఆమె ఏమాత్రం లక్ష్య పెట్టలేదు, లెక్క చేయలేదు. దుమ్మెత్తి పోసినా, పేడ నీళ్ళు కుమ్మరించినా, రాళ్ళువిసిరినా చలించలేదు. ఈనాడు హరిజన, గిరిజన, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలంతా విద్యా

పరంగా ముందడుగు వేస్తున్నారంటే, అది ఫాతిమా షేక్, ఉస్మాన్ షేక్, సావిత్రిబాయి, జ్యోతిరావు పూలేల వంటి సంస్కర్తల పుణ్యమే అని గ్రహించాలి. సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో సావిత్రిపూలే, జ్యోతిబా పూలేలతో కలసి ఫాతిమా విద్యావ్యాప్తితో పాటు, అనేక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఫాతిమా షేక్ గురించి సావిత్రీబాయి పూలే ఇలా రాశారు:' ఫాతిమా నాకు ఎంతగానో సహకరించారు. ఆమె సహకారంతోనే నేను అనేక సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అంటూ ఆమె తన భర్త జ్యోతిబా పూలేకు రాసిన లేఖలలో పేర్కొన్నారు. ఫాతిమా షేక్ సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టినంతగా సాహిత్యంపై పెట్టలేదు. లేకపోతే ఆమె గొప్పసాహిత్యాన్ని సృజించి ఉండేవారని, ఆమెకు సంబంధించిన సమాచారం లభించడంలో అది ఎంతగానో ఉపయోగ పడేదని ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే ఆయన ఫాతిమా షేక్‌లకు సంబంధించిన సంక్షిప్త సమాచారంతో 73 పేజీల పుస్తకాన్ని వెలువరించారు. సమగ్ర సమాచార సేకరణలో తలమునకలై ఉన్నారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అబుల్ కలాం ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని ' బాల్ భారతి ' లో పాఠ్యాంశంగా చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత సంవత్సరమే ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, 8 వ తరగతి పాఠ్యపుస్తకాలలో ఆమె రచనలపై పాఠాన్ని ప్రవేశపెట్టింది. ఆమె కేవలం ముస్లిం సమాజం కోసమే పనిచేయలేదు, సమాజంలో వివక్షకు, అన్యాయానికి, అణచివేతకు, అవిద్యకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసమూ ఆమె పాటు పడ్డారు. అగ్రకులాధిపత్యంలో తీవ్ర వివక్షకు గురైన వితంతువుల్లో చైతన్యం తీసుకురావడానికీ ఆమె శక్తివంచనలేని ప్రయత్నం చేశారు. ఎలాంటి అసమానతలూ లేని సమ సమాజాన్ని ఆమె కాంక్షించారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే అయినప్పుడు మానవుల మధ్యనే ఈవివక్ష ఎందుకన్నది ఆమె ప్రశ్న. ఇంతటి స్ఫూర్తి ప్రదాత అయిన ఫాతిమా షేక్ కు సంబంధించిన పూర్తి వివరాలు, ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యావ్యాప్తికోసం ఆమె చేసిన అసామాన్య కృషిని చరిత్రకారులు వెలికి తీసి, వెలుగులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, షుమారు 192 సంవత్సరాల క్రితంనాటి అజ్ఞాన సమాజంలో, నాటి ప్రతిబంధకాలన్నిటినీ ఛేదించుకొని సమాజ సంస్కరణకోసం నడుం బిగించడం, లక్ష్యాన్ని ముద్దాడడం సామాన్య విషయం కాదు. ఈకారణంగానే గత సంవత్సరం ఆమె 191వ జయంతి సందర్భంగా గూగుల్ సంస్థ తన హోమ్ పేజీలో డూడుల్‌తో సత్కరించింది. కనుక సావిత్రిబాయి పూలేతో పాటు, ఫాతిమా షేక్‌నూ స్మరించుకోవలసిన అవసరం ఉంది. విపత్కర పరిస్థితుల్లో పూలే దంపతులకు ఆశ్రయం కల్పించి, తమ హవేలీని పాఠశాల నిర్వహణకోసం వితరణగా ఇచ్చి, వారితో భుజం భుజం కలిపి పనిచేసిన ఫాతిమా షేక్ కృషినీ గుర్తించి, సావిత్రిబాయితో సమానంగా గౌరవిస్తూ, పీడిత, తాడిత అణగారిన వర్గాల అభ్యున్నతికోసం ఆమె చేసిన త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఉంది. ఫాతిమా, సావిత్రి స్ఫూర్తితో బహుజనులంతా కలిసి హక్కులకోసం సమిష్టి పోరాటాలు చేయవలసిన అవసరమూ ఉంది. ❑


# ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

**తెలుగు – హిందీ – ఇంగ్లీష్ – తమిళం – కన్నడ – మరాఠీ – బెంగాలీ**

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**




**"తానొకటి తలిస్తే దైవం మరొకటి తలిచాడు"** అన్న నానుడి చాలాసార్లు వినే ఉంటారు. అది నిజం అని కూడా చాలా సార్లు నిరూపించబడింది.

కాని కళ్ళ ముందు ధనం, అధికారం, అహంకారమనే మాయ తెరలు మనల్ని ఆ నిజాన్ని ఒప్పుకోకుండా చేస్తున్నాయి.

ఒక్క క్షణంలో ఓడలు బండ్లు, బండ్లు ఓడలుగా మారిపోవడం కూడా మనం చూస్తున్నే ఉన్నాం.

''నేను, నేను'' అని విర్రవీగిన వారు, నా అంతటి వాడు లేనే లేడు, నా మాటే వేదం. నేను కనుసైగ చేస్తే ఏదైనా జరిగిపోతుంది అని నిన్నటిదాకా విర్రవీగిన వారు నేడు ''కుక్కిన పేనులా'' అనామకులుగా మిగిలిపోయిన వారు కూడా ఎందరో మన చుట్టూ కనబడతారు.

అధికారం దైవం ఇచ్చిన ఒక అప్పగింత. దాన్ని న్యాయం ధర్మం తప్పకుండా సరైన రీతిలో సద్వినియోగం చేసుకుని మరణానంతరం పనికి వచ్చే పుణ్యాలు సమకూర్చుకోవాలి.

అలా కాకుండా తన అదృష్టయోగ్యంగా భావించి స్వార్థం, స్వలాభం కోసం, ఆస్తులు అంతస్తులు, ఫాం హౌస్‌లు కొట్టుకోవడం కోసం ప్రయత్నిస్తే అది మూడునాళ్ళ ముచ్చట అని మరచి పోకూడదు.

మనకన్నా ముందు చాలా మంది ఇలాగే హోదా అంతస్తులు, అధికారాల వెనుక పరుగులు తీశారు. ఒక వెలుగు వెలిగారు. ఎక్కడ చూసినా వారి చర్చే. కానీ నేడు వారిని గురించి మాట్లాడుకునే వారే కనిపించడం లేదు.

మరికొందరు ఘోరాతి ఘోరమైన అవమానాల పాలై ఈ లోకం నుంచి నిష్క్రమించారు.

మరికొందరు జైలు శిక్ష అనుభవిస్తున్న కటిక నేల మీద పడుకునే దుస్థితి దాపురించింది.

ఇదంతా ఎందుకు జరిగింది, తమకు లభించిన హోదా, అధికారం, అంతస్తు తమ అదృష్టం కొద్దీ అని లేదా తమ తెలివి తేటలతో లభించింది అని భావించడమే.

వాస్తవానికి ఇవన్నీ దైవం ఇచ్చిన వరాలు. ఒక పరీక్ష కోసం మాత్రమే.

ఇదే విషయం మానవాళి మార్గదర్శి ఖురాన్ గ్రంథంలో ఇలా చెప్పబడింది.

ఇలా అను? ''ఓ అల్లాహ్! విశ్వసామ్రాజ్యాధిపతీ, ప్రభూ! నీవు కోరినవారికి ప్రభుత్వాధికారాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారి నుండి దాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవాన్ని

ప్రసాదిస్తావు. నీవు కోరిన వారిని పరాభవంపాలు చేస్తావు. శుభాలు నీ అధీనంలో ఉన్నాయి. నిస్సందేహంగా నీకు అన్నింటిపైనా అధికారం ఉంది. నీవు రాత్రిని పగటిలోకి ప్రవేశింపచేస్తావు. పగలును రాత్రిలోకి ప్రవేశింప చేస్తావు. ప్రాణంలేని దానినుండి ప్రాణమున్న దానిని తీస్తావు. ప్రాణమున్న దానినుండి ప్రాణం లేనిదానిని తీస్తావు. నీవు కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తావు.'' (ఖురాన్ 3:26-27)

మరణానంతరం పర్యవసానం తెలియక ఇక్కడ నా కంటే నాకు అధికారం కావాలని ఉబలాటం పడుతుంటారు.

లభించిన హోదా, అధికారానికి న్యాయం చేకూర్చక పోతే భయంకరమైన శిక్ష అనుభవించవలసి ఉంటుంది.

ప్రపంచంలో హద్దులు మీరిన అధికార బలంతో ఒక్క వెలుగు వెలిగి ప్రజలను దౌర్జన్యానికి, అన్యాయానికి గురిచేసిన ఏ ఒక్క పాలకుడు అక్కడ తప్పించుకోలేరు.

దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "అల్లాహ్ ప్రళయదినాన ఆకాశాలన్నింటిని చుట్టి తన కుడిచేతిలో ఒడిసిపట్టుకొని, నేను రాజాధిరాజును. సృష్టిపై తమ సొంత ఇష్టాలను రుద్దిన ఆ క్రూరులైన పాలకులెక్కడా? నా భూమ్మీద తమ బడాయి, సింహాసనాల్ని వేసుకొని కూర్చునే ఆ రాజులేరి?? అని గద్దిస్తాడు. ఆ తరువాత భూమిని తన ఎడమ చేతితో చుట్టి, "నేనే చక్రవర్తిని, తమకు లభించిన ఆ శక్తి సామర్థ్యాలు చూసుకుని ప్రజలను పీడించిన ఆ దౌర్జన్య పరులు ఏరి? ధన మదంతో కన్ను మిన్నూ గానక విర్రవీగేవారు, తమకు లభించిన హోదా అంతస్తులను చూసుకొని విర్రవీగే ఆ గర్విష్టులు ఎక్కడా??'' అని ప్రశ్నిస్తాడు.

ఇక్కడ లభించిన ప్రతి హోదాకు మరణానంతరం జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

పాలనా వ్యవస్థలో, న్యాయవ్యవస్థలో పనిచేసే ప్రతి చిన్నా పెద్దా అధికారుల్ని ఉద్యోగుల్ని పరోక్షంగాను హెచ్చరించడం జరిగింది. ఈ హెచ్చరిక ఏమిటంటే, మీరు ఏయే హోదాల్లోనయితే పని చేస్తున్నారో లేక ఏయే ప్రభుత్వ శాఖలకు ఇన్చార్జులుగా ఉన్నారో, ఎంతో న్యాయంగా, దైవభీతి కలిగి మీ బాధ్యతలను నెరవేర్చే ప్రయత్నం చేయండి. అక్కడ అల్లాహ్ ఏర్పరచే న్యాయస్థానంలో మిమ్మల్ని నిలబెట్టి, మీరు భూలోకంలో ఏ బాధ్యతలనయితే తీసుకున్నారో, మీకే అమానతునయితే అధీనం చేయడం జరిగిందో దాన్ని పూర్తిగా నిర్వర్తించారా లేదా? అని అడగడం జరుగుతుంది జాగ్రత్త!

అందుకే ఇస్లామీయ పాలనలో ప్రతి పైసాకు జవాబు చెప్పుకోవాలి అన్న భయంతో గజ గజ వణికిపోయేవారు.

ఒక సారి చక్రవర్తి ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ వద్దకు అతని సహచరుడు ఒకడు ఒక విషయం చర్చించడానికి వచ్చాడు. అప్పుడు చక్రవర్తి దీపం వెలుగులో రాజ్యం పద్దులు వ్రాసుకుంటున్నారు.

"చెప్పండి మీరు మాట్లాడాలి అనుకుంటున్నది రాజ్యం విషయమా లేక మీ సొంత విషయమా?'' అని అడిగాడు.

నా సొంత విషయం చక్రవర్తి గారు. అని చెప్పాడు.

చక్రవర్తి వెంటనే దీపం ఆర్పివేసి. ఇక చెప్పండి అన్నాడు.

"అదేంటి దీపం ఆర్పివేశారు?'' అని అతను ఆశ్చర్యంగా అడిగాడు.

"ఈ దీపంలో నూనే రాజ్యం యొక్క ఖజానాది. దీన్ని అందుకే ఆర్పివేశాను'' అని సమాధానం ఇచ్చాడు.

ఇలాగే నిజమైన ముస్లింలు తాము పనిచేసే చోట కలం రాస్తుందా లేదా అని తెలుసుకోవడానికి ప్రభుత్వ కాగితం మీద గీసి చూడడానికి కూడా ఇష్ట పడేవారు కాదు.

కానీ నేడు విశ్వ వ్యాప్తంగా ఒక వైపు ప్రజలు అన్నం కోసం, చిన్న పిల్లలు వైద్యం కోసం మంచినీటి కోసం అలమటిస్తుంటే, పాలకులు ప్రజాధనంతో ఇంద్ర భవనాలు, లక్షల రూపాయలు విలువ చేసే సూటు బూటు, విలాసవంతమైన వాహనాల్లో తిరుగుతూ ప్రజాధనాన్ని నీళ్ళలా ఖర్చు చేస్తున్నారు.

పాలకుల్లారా! జాగ్రత్త ఈ జీవితం మూడు నాళ్ళ ముచ్చట. మరణం తథ్యం. మరణానంతరం మీరు ఖర్చు చేసే ప్రతి పైసాకు లెక్క చూపాలి. మీ విలాసాలు, విందులకు, ఆర్భాటాలకు జవాబు చెప్పుకోవాలి. లేదా అక్కడ శాశ్వతమైన జీవితం భయంకరమైన అగ్ని శిక్ష అనుభవించవలసి ఉంటుంది జాగ్రత్త.

**అతి త్వరలో...**

'భువిలో శుభవార్త' ధారావాహిక శీర్షికన శ్రీ ఎస్.ఎమ్. మలిక్ 'గీటురాయి' పాఠకుల కొరకు అందిస్తున్న మరో సహచర మాన్యుని జీవిత చరిత్ర **"విచక్షణా ప్రమాణం".**

# బిడ్డా ఎప్పుడొస్తవ్...?

- డాక్టర్ ముహమ్మద్ హసన్



**చాన్నాళ్లకు** కడుపులో పడితివి
నువ్వు కడుపులో పడ్డ నుంచి
కంటికి రెప్పలా కాచిన
నువ్వు కడుపులో కదలకపోతే
కోటి దేవతలకు మొక్కుకున్న
నీ కోసం మీ నాన్న వెయ్యి కళ్ళతో ఎదురు చూడబట్టే
నీకోసం ఎన్నో కష్టాలను ఇష్టంగా భరించిన
నువ్వు ఆరోగ్యంగా ఈ లోకంలోకి రావాలని
ఆస్పత్రుల చుట్టూ తిరిగిన
బలానికి టానిక్కులు, గోళీలు మింగి, సూదులు వేయించుకున్న..
కడుపుకు కత్తెర పెడితే గాని బయటికి రానని మారం చేస్తే
కత్తిగాట్లు భరించిన...!
నువ్వు పుట్టాక మీ నాన్న కళ్ళల్లో ఆనందం..
నాకేమో మాతృత్వపు ఉద్వేగం...!
పెరిగి పెద్దవాడివై మా కష్టాలు తీరుస్తావని
ఇద్దరం కలిసి కంటికి రెప్పలా కాసినం నిన్ను
నీకోసం మీ అయ్య గల్ఫ్‌లో గొర్ల కాపరిగా మారే...
అయ్య పంపిన దినార్లతో
దిగులు పడకుండా సదివిస్తి నిన్ను..
కాలానికి కన్నుకుట్టి మీ అయ్యను ఎములోడు లాక్కుపోతే...!
నువ్వే ప్రపంచంగా బ్రతికిన
చెట్టు లాగా ఏపుగా నువ్వు ఎదుగుతుంటే
నీలో మీ నాన్నను చూసి మురిసిపోయా..
నీ నడక నీ మాట విరుపు అచ్చం అయ్యను గుర్తుకు తెస్తివి..!
నీకు తగిన జోడును చూసి పిల్లల్ని ఎత్తుకొని మురిసిపోతూ..!
కళ్ళు మూయాలని అనుకున్నా..
నా జన్మ దోషమో, నీ జాతక దోషమో..!
గత జన్మలోని పాపమో ఏమో..!
మాయదారి రోగం వచ్చి మానవత్వం లేకుండా
మట్టిలో కలిపింది నిన్ను..
మీ నాన్న పోతే నువ్వు ఉన్నావు అనుకొని ధైర్యంగా బ్రతికా..
ఇప్పుడు నిన్ను కూడా దూరం సేసి పిచ్చిదాన్ని సేసిందు జాలి లేని దేవుడు...!
నువ్వు లేకుండా ఎలా బ్రతకాలి బిడ్డా...?
“బిడ్డా ఎప్పుడొస్తవ్”...?

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది

- ముహమ్మద్ వహీదుద్దీన్

**'అమ్మ'..** ఆ తియ్యని పదంలోనే ఒక మధురానుభూతి. ఆ పిలుపులోనే ఒక నిండుతనం, ఒక మాధుర్యం, ఒక ధైర్యం, భరోసా, ధీమా... అమ్మ అనే ఒక అనిర్వచనీయమైన పిలుపు మాటలకు, పదాలకు సరిపోని ఉన్నత శిఖరం. ఈ సృష్టి నిరంతరంగా వృద్ధి చెందడానికి మూలం అమ్మ. కొలమానం లేనిది తల్లి ప్రేమే. సాదాగా కనిపించే ఓ విశిష్ట వ్యక్తిత్వం ఇలా ఎంత చెప్పినా ఎన్ని పదాలలో ఎన్ని వాక్యాలలో చెప్పినా ఎప్పటికి పూర్తికాని అనుభూతి అమ్మ. మనం పుట్టి పెరిగిన తర్వాత మన జీవితాన్ని గురించి కలలు కంటాము. కాని మనం తన కడుపున పడిన క్షణం నుండే అహర్నిశలు మన గురించే కలలు కంటూ తనను తాను మర్చిపోతుంది అమ్మ. బిడ్డ జీవితమే తన జీవితంగా తన అస్తిత్వాన్ని అణిచివేసి బిడ్డ ప్రగతిలో తాను జీవిస్తుంది. ఇలా ఎంతని రాయను, ఎప్పటికి పూర్తి కానిది ఆమె త్యాగాల కీర్తి. తాను వంగి పని చేస్తున్న, నిద్రపోతున్నా కడుపులోని బిడ్డకు అసౌకర్యంగా ఉండకూడదని తల్లడిల్లే పిచ్చి ప్రేమ అమ్మ ప్రేమే.

మనకు ధైర్యాన్ని నేర్పిన అమ్మ ఎందుకో ఇప్పుడు అధైర్య పడుతుంది. మనకు నడక నేర్పిన అమ్మ నడిరోడ్ల పాలవు తుంది. మనకు భద్రంగా పెంచిన అమ్మ ఈ రోజు వృద్ధా శ్రమాలలో అనాథగా మారిపోయింది. కారణం ఏదైనా ప్రస్తుతం అమ్మ కనికరం కోసం పరితపిస్తూ, పడిగాపులు కాస్తుంది.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : ''తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది'' (తిబ్రానీ)

ఒకతను దైవప్రవక్త (స)ను నేను సేవ చేయడానికి నా తల్లి దండ్రులలో ఎవరెక్కువ హక్కుదారులు? అని అడిగారు. దానికి దైవప్రవక్త 'నీ తల్లి' అని సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి మళ్ళీ ఆ తరువాత ఎవరు? అని ప్రశ్నించాడు. దానికి కూడా దైవ ప్రవక్త(స) 'నీ తల్లి' అనే సమాధానమిచ్చారు. ఆ వ్యక్తి తిరిగి ఆ తరువాత ఎవరు? అని అడిగారు. దైవప్రవక్త(స) 'నీ తల్లి' అనే సమాధానమిచ్చారు. అతను మళ్ళీ ఆ తరువాత ఎవరు? అని అడిగారు. దానికి దైవప్రవక్త(స) ''నీ తండ్రి'' అని చెప్పారు. (బుఖారీ, ముస్లిమ్)

మరొకతను వచ్చి 'దైవప్రవక్తా! మీరు నన్ను ఏ విషయం గురించి ఆదేశిస్తారు?'' అని అడిగాడు. దానికి దైవప్రవక్త(స) 'నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగి వుండు' అని చెప్పారు. ఆ వ్యక్తి అదే ప్రశ్న మూడుసార్లు అడిగాడు. మూడుసార్లు కూడా దైవప్రవక్త(స) నీ తల్లి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండమనే చెప్పారు. నాల్గవ సారి నీ తండ్రి అని చెప్పారు. (బుఖారీ, ముస్లిమ్)

దైవప్రవక్త(స) ఓ రోజు తన సహచరులతో ముచ్చటిస్తూ ఇలా చెప్పారు : ''నేను (రాత్రి) స్వర్గ దృశ్యాలు చూస్తున్నట్లు కలగ న్నాను. అక్కడ నేను ఎవరో దివ్య ఖుర్ఆన్ పఠించడం విన్నాను. నేను ఈ కంఠస్వరం ఎవరిదని అడిగాను. దానికి ఇది 'హారిసా బిన్ నోమాన్(రజి) కంఠస్వరం అని సమాధానం వచ్చింది. ఇదే తల్లి పట్ల సత్ప్రవర్తన పుణ్యఫలం . ఇదీ అసలు తల్లి పట్ల సత్ప్రవర్తన పుణ్యఫలమంటే'' (మిష్కాత్)

ఒకతను దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి 'నా వల్ల పెద్ద పాపం జరిగిపోయింది. దీనికి నిష్కృతి ఏదైనా ఉందంటారా? అని అడిగాడు. దైవప్రవక్త(స) ఈ మాట విని 'నీ తల్లి (జీవించి) ఉందా?' అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి లేదన్నాడు. 'పోనీ నీ పిన్నమ్మ గానీ, పెద్దమ్మ గానీ ఉందా?' అని అడిగారు దైవప్రవక్త(స). అతను ఉందన్నాడు. ''అయితే ఆమె పట్ల మంచిగా ప్రవర్తిస్తూ ఉండు' అన్నారు దైవప్రవక్త ముహ మ్మద్(స).

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**53 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 42. అష్ షూరా

35 పరిపక్వమయిన సహనం కృతజ్ఞతా భావం చూపే ప్రతి వ్యక్తికి – లేదా (వాటినెక్కి పయనించేవారి) అనేక అపరాధాలను మన్నించి వారి చేష్టలు కొన్నింటికే శాస్తిగా వారిని ముంచివేయగలడు; అప్పుడు మా ఆయత్‌ల విషయంలో వాదులాడే వారికి తెలిసిపోతుంది వారికి ఏ ఆశ్రయమూ లేదని.[54]

36 – 37 మీకు ఇవ్వబడినదేమయినా అంతా కొన్నాళ్ళ ఐహిక జీవన సామగ్రి మాత్రమే.[55] మరేదయితే అల్లాహ్ వద్ద ఉన్నదో అది ఉత్తమమయినదీ సుస్థిరమయినదీను.[56] ఇది వీరి కొరకే ప్రత్యేకం–వారు విశ్వసించిన వారు, తమ ప్రభువుపైన భారం మోపేవారు,[57] పెద్ద పెద్ద పాపాలకు, లజ్జావిహీనమయిన పోకడలకు దూరంగా మసలుకునేవారు, ఇంకా కోపం వస్తే మన్నించివేసేవారు,

54. కురైష్ ప్రజలు తమ వ్యాపార వ్యవహారాల కొరకు అబీసీనియా, ఆఫ్రికా తీర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చేది. ఈ ప్రయాణాలలో వారు నౌకలు, పడవలు, ఓడల ద్వారా ఎర్ర సముద్రంలో పయనించేవారు. అది అతి ప్రమాదకరమయిన సముద్రం. అందులో తరచుగా తుఫానులు సంభవించేవి. నీటిలో కొండలు అనేకమున్నాయి. తుఫానులు సంభవించే వేళల్లో వాటిని ఢీకొనే ప్రమాదముంటుంది. అందువల్ల ఏ స్థితిని ఇక్కడ చిత్రించడం జరిగిందో దాన్ని కురైష్ ప్రజలు తమ స్వీయ అనుభవాల వెలుగులో పూర్తిగా గ్రహించగలిగేవారు.

55. అంటే, ఇదంతా ఏదో ఉబ్బి తబ్బిబ్బయ్యే విషయం కాదు. మహా ఘనమయిన సిరిసంపదలు సయితం ఏ వ్యక్తికి ప్రాప్తమయినా కేవలం కొంతకాలానికి మాత్రమే ప్రాప్తమయ్యాయి. కొన్నేళ్ళు అతను దాన్ని వాడుకుంటాడు. తరువాత అంతా వదిలేసి అతను ప్రపంచం నుండి వట్టి చేతులతో నిష్క్రమిస్తాడు. ఆ సంపదలు అతని చిట్టా పుస్తకాల్లో ఎంతగా ఘనమయినవయినా ఆచరణాత్మకంగా అతని ఉపయోగానికి ప్రాప్తమయ్యేవి అందులోని ఒక అతి స్వల్పమయిన భాగం మాత్రమే. అటువంటి సిరిసంపదల పట్ల నీలగడం, తనను గురించి, తన ఈ ఐశ్వర్యాన్ని గురించి, స్వయంగా ఈ ప్రపంచాన్ని గురించి యదార్థాన్ని తెలుసుకున్న వ్యక్తికి ఎంతమాత్రం శోభించదు.

56. అంటే, ఆ సంపద దాని స్వభావం, స్థితిగతుల రీత్యానూ ఉన్నత స్థాయికి చెందింది, అంతేకాక అది తాత్కాలిక మయింది, తత్సమయానికి చెందింది కూడా కాదు. అది శాశ్వతమయింది, పతనహీనమయింది.

57. అల్లాహ్‌పై భారం మోపడాన్ని ఇక్కడ విశ్వాసానికి తప్పనిసరి ఆవశ్యకతగా, పరలోక సాఫల్యానికి అవశ్యమయిన గుణంగా పరిగణించడం జరిగింది. మూలంలోని 'తవక్కుల్' లేదా భారం మోపడం అంటే భావం ఇది : మొదటిది, అల్లాహ్ మార్గదర్శకత్వం పట్ల మనిషికి పూర్తి విశ్వాసం ఉండాలి. యదార్థాల జ్ఞానం, నీతి నియమాల సూత్రాలు, ధర్మాధర్మాల పరిమితులు, ప్రపంచంలో మనుగడ సాగించే నియమ నిబంధనలు ఏవయితే అల్లాహ్ ప్రసాదించాడో అవే ధర్మమయినవని, సత్యమయినవని, వాటి అనుసరణలోనే మానవుని మేలు ఇమిడి ఉందని అతను గట్టిగా భావించాలి. రెండవది, మనిషి భరోసా తన బలం, సామర్థ్యం, తన సాధనా సంపత్తులు, ఉపాయాలు, దైవేతర శక్తుల సహాయ సహ కారాలపైన ఏర్పడరాదు దానికి బదులు అతను ఒక మాట బాగా గుర్తుంచుకోవాలి. ఇహపరాలకు చెందిన ప్రతి వ్యవహారంలోనూ అతని సాఫల్యం, విజయం అల్లాహ్ ప్రసాదించే సద్బుద్ధి, ఆయన మద్దత్తుపైనే ఆధారపడి ఉన్నాయని గ్రహించాలి. అల్లాహ్ ప్రసాదించే సద్బుద్ధి, సహకారాలకు పాత్రుడవాలంటే అతను ఆయన ప్రసన్నతను లక్ష్యంగా చేసుకుని, ఆయన నియమించిన పరిమితులను పాటిస్తూ వ్యవహరించాలి. మూడవది, మనిషి అల్లాహ్ చేసిన వాగ్దానాల పట్ల పూర్తి నమ్మకం కలిగి ఉండాలి. విశ్వాసం, సదాచరణా వైఖరిని అవలంబించిన వారికి, మిథ్యావాదానికి బదులు సత్యం కొరకు పనిచేసే దాసులకు ఆయన ఈ వాగ్దానాలు చేశాడు. ఈ వాగ్దానాలను విశ్వసించి మాత్రమే అతను మిథ్యామార్గాన సాగిన పక్షంలో తనకు లభిస్తూ ఉన్నట్లు గోచరించే సమస్త ప్రయోజనాలను, లాభాలను, రుచులను కాలరాయాలి. అలాగే సత్యం పట్ల స్థిరత కనబరచినందుకు తనకు ప్రాప్తించే సకల నష్టాలను, కష్టాలను, తాను పలు విధాలా ఉపేక్షకు గురవడాన్ని భరించాలి. 'తవక్కుల్' (దైవంపైన భారం మోపడం) అనే పద భావానికి గల ఈ వివరణ వల్ల 'విశ్వాసం'తో దీనికి గల ప్రగాఢ సంబంధం ఎటువంటిదో విశదమవుతోంది. ఇదే లేకుండా కేవలం వట్టిగా అంగీకారం, ఒప్పుకోలు వరకు పరిమితమయిన విశ్వాసం ద్వారా, విశ్వసించి దైవంపైన భారం మోపినవారికి చేసిన వాగ్దానం వంటి మహత్తరమయిన పరిణామ ఫలాలు ఎందుకు ప్రాప్తం కాజాలవో కూడా ద్యోతకమయి పోతుంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

## అధ్యాయం : 10

## హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) విశిష్టత

ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) హజ్రత్ అలీ(రజి)తో “నీవు నా వాడవు. నేను నీకు చెందినవాడను”[1] అని పలికారు. హజ్రత్ ఉమర్(రజి) హజ్రత్ అలీ(రజి)తో, “దైవప్రవక్త(స) తన మరణ కాలం వరకు మీ పట్ల ప్రసన్నులై ఉన్నార”ని చెప్పారు.

**346)** హజ్రత్ సహ్ల్ బిన్ సాద్(రజి) ఉల్లేఖించారు : దైవప్రవక్త(సఅసం) ఖైబర్ యుద్ధ సందర్భంగా, “రేపు నేను ఒక వ్యక్తి చేతికి ఇస్లామ్ పతాకం ఇస్తాను. అల్లాహ్ అతని చేతుల మీదుగా విజయం ప్రసాదిస్తాడ”ని అన్నారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు: రాత్రంతా జనులు ఆలోచనల్లో మునిగిపోయారు– తెల్లవారాక ఇస్లామ్ పతాకం ఎవరి చేతికి ఇవ్వబడుతుందా! అని. తెల్లవారాక అందరూ దైవ ప్రవక్త(స) సమక్షంలో హాజరయ్యారు. పతాకం తమకే ఇవ్వబడుతుందని ప్రతి ఒక్కరూ ఆశించారు. కాని, “అలీ బిన్ అబీ తాలిబ్ ఎక్కడ?” అని దైవప్రవక్త(స) ప్రశ్నించారు. ‘ఆయన కళ్లలో నొప్పి ఉంద’ని సహచరులు చెప్పారు. “ఎవరినయినా పంపి అతన్ని పిలుచుకుని రండి” అని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఆయన వచ్చిన తరువాత దైవప్రవక్త(స) తన లాలాజలాన్ని ఆయన కళ్లలో వేశారు. ఆయన కొరకు ప్రార్థించారు. దాంతో ఆయనకు సంపూర్ణ స్వస్థత చేకూరింది. తనకు అసలు ఏ బాధా లేనట్లే ఆరోగ్యవంతులయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇస్లామ్ ధ్వజాన్ని ఆయన చేతికి ఇచ్చారు. ‘దైవప్రవక్తా! వారు కూడా మనలాగే అయ్యేవరకూ (అంటే ముస్లింలుగా పరివర్తన చెందేవరకూ) వారితో పోరాడతాను’ అన్నారు అలీ(రజి). దానికి ఆయన(స), “ప్రస్తుతానికి ఇలాగే ముందుకు సాగిపోండి. మీరంతా వారి ప్రాంతంలో అడుగు పెట్టిన తరువాత, మొదట వారికి ఇస్లామ్ సందేశం చేర వేయండి. అల్లాహ్‌కు వారిపై గల హక్కులు ఏమిటో వారికి విశదపరచండి. దైవ సాక్షి! నీ ద్వారా అల్లాహ్ ఒక్క వ్యక్తికి సన్మార్గం వొసగినా, అది నీ పాలిట ఎర్రని ఒంటెల (సంపద) కన్నా మేలైనది”[1] అని ఉపదేశించారు.

10-1. హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) ముస్లింలకు నాల్గవ సన్మార్గగామి ఖలీఫా (రజి) అయ్యారు. అబుల్ హసన్, అబూ తురాబ్ ఈయన కునీయత్. ఎనిమిదేళ్ళ ప్రాయంలోనే ఇస్లామ్ స్వీకరించారు. ఒక్క తబూక్ యుద్ధంలో తప్ప మిగిలిన యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. గోధుమ వర్ణం శరీరం. అందమైన కళ్ళు. ఎక్కువ పొడుగరి కారు. గుబురు గడ్డం చూడచక్కగా ఉండేది. చివరి కాలంలో గడ్డంతోపాటు తల కూడా నెరసి పోయింది. హజ్రత్ ఉస్మాన్ అమరగతి నొందిన రోజున - హిజ్రీ 35వ సంవత్సరం, జిల్ హజ్జా 18వ తేదీ శుక్రవారం నాడు ఖిలాఫత్ బాధ్యతలు ఆయనకు కట్టబెట్టడం జరిగింది. హిజ్రీ 40వ ఏట రమజాన్ నెల 18వ తేదీన శుక్రవారం నాడు అబ్దుర్రహ్మాన్ బిన్ ముల్జిమ్ అనే వ్యక్తి ఖడ్గంతో ఆయన తలపై వ్రేటు వేశాడు. గాయపడిన మూడు రోజుల తర్వాత ఆయన అమరగతినొందారు- ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. హజ్రత్ హసన్ (రజి) నమాజె జనాజాకు సారథ్యం వహించారు. ప్రభాత సమయాన అంత్యక్రియలు జరిగాయి. అప్పటికి ఆయన వయసు 63 సంవత్సరాలు. ఖలీఫాగా నాలుగేళ్ళ పది మాసాలు పరిపాలించారు.

346-1. సాధ్యమైనంత వరకు యుద్ధం జరగకుండా చూడండి అన్నది దైవప్రవక్త(స) పలుకుల్లోని అంతరార్థం. ఇస్లామ్ యుద్ధాన్ని ఇష్టపడదు. అది శాంతినే కోరుకుంటుంది. అది యుద్ధం చేసేది కేవలం ఆత్మరక్షణ కొరకే.



# విశ్వాసాలు

## విశ్వాసాల వాస్తవికత, ప్రాముఖ్యత

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

**మానవుని కదలికలకు,** ఆచరణలన్నింటికీ కేంద్రం అతని ఆలోచనలు, భావాలు, అభిప్రాయాలే. ఆలోచనలే అతన్ని బాగుపరుస్తాయి. లేదా పాడు చేస్తాయి. ఈ ఆలోచనలు లేక భావాలు అతని కొన్ని సూత్రబద్ధమైన భావనలపై ఆధారభూతమై ఉంటాయి. సూత్రబద్ధమైన ఈ భావనలనే "విశ్వాసాలు" అంటారు. ఈ కేంద్రబిందువు నుండే మనిషి ఆచరణలకు సంబంధించిన ప్రతి ఒక్క రేఖ వెలువడుతుంది. అతని జీవిత పరిధి యొక్క ప్రతి గీత ఆ కేంద్రంతోనే ముడివడి ఉంటుంది. మన ఆచరణలు, కార్యకలాపాలన్నీ మన సంకల్పానికి లోబడి ఉంటాయి. మరి సంకల్పానికి ప్రేరణ ఏమంటే; అవి మన ఆలోచనలు, భావాలే. మన ఆలోచనలపై, భావాలు భావనలపై మన లోపలి విశ్వాసాలు రాజ్యమేలుతాయి. సాధారణ వ్యావహారిక భాషలో మనం ఈ వస్తువులను 'హృదయం' (మనసు, ఆంతర్యం)తో పోలుస్తూ ఉంటాము. ఇస్లాం మహోపాధ్యాయులు (స) ఏమన్నారంటే, మనిషి శరీరావయవాలలో అతని హృదయమే మంచీ చెడుల నిలయం. ఆయన (స) ఇలా అన్నారు –

> **"మనిషి శరీరంలో ఒక మాంసపు ముద్ద ఉంది. అది గనక బాగుంటే శరీరమంతా బాగుంటుంది. అది గనక చెడిపోయిందంటే శరీరమంతా చెడిపోతుంది . ఆ మాంసపు ముద్దే హృదయం."** ***(సహీహ్ బుఖారీ – విశ్వాస ప్రకరణం)***

దివ్య ఖుర్ఆన్ ఈ హృదయం (మనసు) యొక్క మూడు పరిస్థితులను వివరించింది. అన్నిటికంటే ముందు **'ఖల్బున్ సలీమ్'** (సురక్షితమయిన మనసు). అంటే ఇది అన్ని రకాల పాపాల నుండి, చెడుగుల నుండి సురక్షితంగా ఉంటుంది. ఇందులో ఎలాంటి దురాలోచనలు, దుష్టభావాలు గూడుకట్టుకోలేవు. దీనికి ఎదురుగా రెండవది **'ఖల్బున్ అసీమ్'** (పాపిష్టి మనసు). అంటే ఇది ఆంతర్యంలో దుష్ప్రేరణలను కలిగిస్తూ, పాపకార్యాలకు దారితీస్తూ ఉంటుంది. మూడవది: **'ఖల్బున్ మునీబ్'** (మరలివచ్చే మనసు, మారుమనసు, రుజువర్తన చెందే మనసు). అంటే మానవ సహజమైన దౌర్బల్యం కారణంగా పెడదారి పట్టినప్పటికీ, తొందరగానే తన తప్పును తెలుసుకుని సత్యం వైపునకు మరలివస్తుంది. మొత్తానికి వీటన్నింటికీ మూలం సంకల్పం. అది ఎటువంటి 'ఆవిరి' అంటే, దాని ఉత్ప్రేరకంతోనే యంత్రంలోని పరికరాలలో చలనం వస్తుంది. అందుకే మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"ఆచరణలన్నీ సంకల్పంపై ఆధారభూతమై ఉన్నాయి." (సహీహ్ బుఖారీ – ఆరంభ ప్రకరణం)

ఇదే అర్థాన్ని ఆయన (స) వేరే మాటల్లో ఇలా వివరించారు :

> **"ప్రతి వ్యక్తికీ అతను సంకల్పించుకున్న దాన్నిబట్టే ప్రాప్తమవుతుంది. ఎవరయినా ప్రాపంచిక ఉద్దేశ్యాల ప్రాప్తికై హిజ్రత్ చేస్తే లేదా ఎవరయినా ఒక మహిళను వివాహమాడటానికి హిజ్రత్ చేస్తే అదే అతనికి లభిస్తుంది. (అంటే ఈ చర్యవల్ల అతనికి ధార్మిక పుణ్యఫలం లభించదు).**
>
> ***(సహీహ్ బుఖారీ – ఆరంభ ప్రకరణం)***

ఈ మధ్య మనస్తత్వ శాస్త్రం కూడా దీనిని నిజమని రుజువు చేసింది. అదేమంటుందంటే మనిషి ఆచరణల సంస్కరణ కోసం ముందుగా

అతని మనోమస్తిష్కాలను సంస్కరించటం అవసరం. మానవుని హృదయాన్ని, సంకల్పాన్ని శాసించే వస్తువు ఏదైనా ఉందంటే అది 'విశ్వాసమే'. కాబట్టి ఆచరణలు సజావుగా, బాగుగా ఉండాలంటే మనిషికి కొన్ని పవిత్రమైన, స్వచ్ఛమైన నియమాలు అవసరం. మనసు స్థిరంగా ఉండాలి. అతని మనసులోని విశ్వాసం లేక నమ్మకం చలించని పర్వతంలా ఉండాలి. అటువంటి సుస్థిరమైన విశ్వాసానికి కట్టుబడి మనం మన పనులన్నింటినీ నెరవేర్చాలి.

ఏ విధంగానయితే కొన్ని స్థిత సూత్రాలను, పరిచిత నియమాలను అంగీకరించనంత వరకూ క్షేత్ర గణితం నిరూపితం కాజాలదో అదే విధంగా కొన్ని నియమిత సూత్రాలను ఒప్పుకోనంత వరకూ మానవుని ఏ సదాచరణ కూడా సరైనదిగా ధ్రువీకరించబడదు.

పైకి చూస్తే బుద్ధి మన ప్రతి పనికి మార్గదర్శిగా కనిపిస్తుంది. కాని చాలా జాగ్రత్తగా పరిశీలించి చూడండి – మన బుద్ధి కూడా స్వతంత్రమైనది కాదు. అది మన మనో విశ్వాసం, మానసిక భావాలు, అంతర్గత భావనల సంకెళ్ళలో బిగుసుకుని ఉంది. కాబట్టి బందీగా ఉన్న ఈ బుద్ధి ద్వారా మనం మన మనోమయ భావాలు, ఆలోచనలపై నియంత్రణ సాధించలేము. ఒకవేళ నియంత్రించ గలిగితే ఆత్మ విశ్వాసం, మనోమయ భావాల ద్వారానే నియంత్రించ గలము. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్ ఎప్పుడు 'విశ్వాసం' (ఈమాన్) గురించి ప్రస్తావించినా సదాచరణ (అమలె సాలెహ్)కి ముందే ప్రస్తా వించింది. విశ్వాసం లేకుండా ఏ సదాచరణను కూడా అది ఆమోదయోగ్యంగా భావించలేదు. విశ్వాసం లేకపోతే మనసులోని సంకల్పానికి అర్ధమే లేదు. అసలు సంకల్పమే లేదు. అబ్దుల్లాహ్ బిన్ జద్‌ఆన్ ఒక ఖురైషు ప్రముఖుడు. అతను ఇస్లాంకు పూర్వం–అజ్ఞానకాలంలో–ఎన్నో మంచి పనులు చేశాడు. కాని అతను బహు దైవారాధకుడు. అందుకే ఒకసారి విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (ర.అ) దైవప్రవక్త (స)ను, 'ఓ దైవప్రవక్తా! ఇస్లాంకు పూర్వం అబ్దుల్లాహ్ బిన్ జద్‌ఆన్ ఎన్నో సత్కార్యాలు చేశాడు కదా, మరి వాటి పుణ్యఫలం అతనికి లభిస్తుందా?' అని అడిగితే, "లేదు, ఆయిషా! ఎందుకంటే అతను ఏ ఒక్క రోజు కూడా, 'ఓ అల్లాహ్! నా పాపాలను మన్నించు' అని పలకలేదు" అని ఆయన (స) చెప్పారు.

బద్ర్ యుద్ధ సందర్భంగా పరాక్రమశాలిగా పేరు మోసిన ఒక బహుదైవాధకుడు వచ్చి, "ఓ ముహమ్మద్ (స)! నేను కూడా మీతో పాటే వచ్చి యుద్ధంలో పాల్గొనాలని అనుకుంటున్నాను. అలా చేస్తే నాకూ విజయప్రాప్తిలో వాటా లభిస్తుందని ఆశిస్తున్నాను' అని అభ్యర్ధించాడు. దానికి ఆయన (స), "నీవు మహోన్నతుడగు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసిస్తున్నావా?" అని దర్యాప్తు చేశారు. దానికతను 'లేద'ని జవాబిచ్చాడు. "అలాగైతే వెళ్ళిపో. నేను ముష్రిక్కుల సహాయం తీసుకోను" అని ఆయన (స) చెప్పారు. రెండవసారి వచ్చి మళ్ళీ అదేవిధంగా అభ్యర్ధించాడు. అతను పేరు ప్రఖ్యాతులు కల యోధుడవటం వల్ల అతని అభ్యర్ధన పట్ల ముస్లింలు ఎంతో శ్రద్ధాసక్తుల్ని కనబరచారు. అతన్ని ఎలాగైనా సైన్యంలో చేర్చుకోవాలన్నది ముస్లింల ఆకాంక్ష. కాని దైవప్రవక్త (స) అతనికి మళ్ళీ అదే ప్రశ్న వేశారు – "నీవు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించావా?" అని. అతను ఈసారి కూడా 'లేద'నే అన్నాడు. దైవప్రవక్త (స) రెండవసారి కూడా, "నేను బహుదైవారాధకుల సహాయం పొందను" అని నిర్దిష్టంగా చెప్పేశారు. ముస్లింలకు ఒక వైపు సైనికుల కొరత ఉంది. మరోవైపున తన లాంటి శూరుణ్ణి కూడా దైవప్రవక్త (స) లెక్క చేయటం లేదు. బహుశా దైవప్రవక్త (స)లోని ఈ నిరపేక్షాభావమే ఆ వ్యక్తిని అమితంగా ప్రభావితుణ్ణి చేసింది. మూడవసారి కూడా ఆ వ్యక్తి వచ్చి తనను సైన్యంలో చేర్చుకొమ్మని కోరినప్పుడు, "నీవు దైవాన్ని, దైవప్రవక్తను విశ్వసించావా?" అని సూటిగా అడిగారు దైవప్రవక్త. దానికతను 'అవున'న్నాడు. ఆ విధంగా అతను సత్యామృతాన్ని ఆస్వాదించిన మీదట సైనిక పంక్తిలో చేరాడు.

విశ్వాస (ఈమాన) భాగ్యానికి నోచుకోకుండా పోయిన వారి ఘనకార్యాలను ఖుర్‌ఆన్ బూడిదతో పోల్చింది. ఒక చిన్నగాలి వస్తే చాలు, అది ఎగిరిపోతుంది –

> **ఎవరు తమ ప్రభువు పట్ల తిరస్కార వైఖరిని ప్రదర్శించారో, వారి కర్మల పరిస్థితి పెనుతుఫాను వచ్చిన దినాన ఉధృత గాలి ఎగురవేసిన బూడిద వంటిది. వారు సముపార్జించిన దానిలో నుండి ఏమీ వారికి ప్రాప్తమవలేదు. అత్యంత చెడ్డమార్గం అంటే ఇదే."** ***(ఇబ్రాహీమ్–18)***

సూరయె నూర్‌లో విశ్వాస భాగ్యానికి దూరమైపోయిన ప్రజల కర్మల ఉపమానం ఎండమావి వంటిదని చెప్పబడింది –

> **అవిశ్వాసుల కర్మల ఉపమానం చదునైన ఎడారి ప్రదేశంలో మెరిసే ఎండమావి లాంటిది. దప్పికగొన్నవాడు దూరం నుంచి చూసి దానిని నీరని భ్రమ చెందుతాడు. తీరా దాని దగ్గరకు వెళితే అక్కడ ఏమీ ఉండదు.** ***(అన్ నూర్ – 39)***

దీని మరొక ఉపమానం దట్టమయిన చీకటి వంటిది. కనీసం చేయి కూడా కనిపించదు. మనిషి శరీరావయవాలు బాగున్నప్పటికీ వాటి ద్వారా ప్రయోజనం పొందటం సంభవం కాదు.

> **లేదా (వారి కర్మలను) ఒక లోతైన సముద్రంలోని చీకటిని ఉపమానంగా చెప్పవచ్చు. దాని (ఆ చీకటి)పై ఒక అల వ్యాపించి ఉన్నది. దానిపై మరొక అల, దానిపై మేఘం. చీకటిపై చీకటి. మనిషి తన చేతిని బయటకు సాచితే, దానిని కూడ చూడలేడు. ఎవరికి అల్లాహ్ తన వెలుగును ప్రసాదించడో, అతనికి మరే వెలుగూ లేదు.**
>
> **(అన్ నూర్ – 40)**

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ–రహ్మ– విరచితమైన 'సీరతున్నబీ' పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***

**(మిగతా వచ్చే సంచికలో)**




**వింతయినది హృదయం...** తనకు లేదు ఏ రూపం. ఎప్పుడు చినుకవుతుందో, ఎప్పుడు పిడుగవుతుందో, ఎప్పుడు అడుగేస్తుందో, ఎప్పుడు- మడుగవుతుందో తెలీదు ఎవ్వరికీ. స్వచ్ఛంగా ఉంచుకుంటే అది తెలుపు. కలుషితం చేస్తే అది నలుపు. తెలుపు పెరిగితే శాంతి, నలుపు పేరుకుంటే అశాంతి. తెల్లగా నవ్విందా జీవన జ్యోతి, నల్లగా నవ్విందా విషమ రాత్రి. అది పచ్చబడినా ఫర్వా లేదు, ఎర్రబడినా ఫర్వా లేదు. కాని అది నల్ల బడితే మాత్రం నియతి చితికిపోతుంది. నిష్ఠ నీరుగారుతుంది. దయార్ధ్రత ఇంకిపోతుంది. ఆత్మీయత ఆవిరయిపోతుంది. కనుకనే ఖుర్‌ఆన్ అంటుంది: "ఆ రోజు సిరి సంపదలుగానీ, సంతానం గానీ దేనికీ పనికి రావు. స్వచ్ఛమయిన హృదయంతో అల్లాహ్ సన్నిధిలోకి వచ్చినవాడు మాత్రమే (ఆనాడు మోక్షం పొందుతాడు)". (షుఅరా: 88,89)

మనలోని భావోద్వేగాలు, అనుభూతులు, కోరికలు, ఆలోచనల కేంద్రం హృదయం. ఏదయినా వస్తువు, ప్రాణి మీద ప్రేమ, ద్వేషం, అయిష్టం కలిగించే ఆంతరంగిక ప్రేరణ హృదయం. మనిషి భావాలు, అభిప్రాయాలు, ఆచరణలు అన్నింటికీ మూలం హృదయం. అందుకే "మనిషి నడవడి, ప్రవర్తన అతని మానసిక స్థితికి అద్దం పడుతుంది" అన్నారు పెద్దలు. ఇదే హృదయం గురించి తెలియజేస్తూ ప్రవక్త(స) ఇలా ఉపదేశించారు:

"దేహంలో ఒక ముద్ద ఉంది. అది గనక బాగుంటే దేహమంతా బాగుంటుంది. అది గనక పాడయితే శరీరం మొత్తం పాడవుతుంది. గుర్తుంచుకోండి! అదే హృదయం!" (బుఖారీ)

ఈ కారణంగానే అల్లాహ్ హృదయాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాలని ఆదేశించాడు: "నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో". (అల్ ముద్దస్సిర్: 4) ఈ వచనంలో దుస్తులు అంటే హృదయం అన్నది పండితుల అభిప్రాయం.

## హృదయ స్వచ్ఛత అంటే

'మానవోత్తములు ఎవరు?' అని ప్రశ్నించగా- "హృదయ స్వచ్ఛత, మాట సత్యత గల ప్రతి వ్యక్తి" అని ప్రవక్త (స)సమాధానమిచ్చారు. 'మాట సత్యత అంటే మాకు తెలుసు. మరి హృదయ స్వచ్ఛత (మఖ్మూముల్ ఖల్బ్)అంటే ఏమి?' అని సహాబా వివరణ కోరగా, "తఖ్వా పరుడు, పరిశుద్ధుడు, ఎలాంటి పాప భావం లేనివాడు, ఎలాంటి అతిక్రమణకు పాల్పడని వాడు, మోసం చెయ్యని వాడు, అసూయ చెందనివాడు" అని అన్నారు ప్రవక్త(స) (ఇబ్ను మాజహ్)

హృదయాన్ని అరబీలో 'ఖల్బ్' అంటారు. కారణం అది ఎప్పుడూ ఒకే స్థితిలో ఉండదు గనక. ఒక స్థితి నుండి మరో స్థితికి మారుతూ ఉంటుంది గనక. ప్రవక్త (స) ఈ దుఆ చేస్తూ ఉండేవారు: "యా ముఖల్లిబల్ ఖులూబ్. సబ్బిత్ ఖల్బీ అలా తాఅతిక్"- ఓ హృదయాలను మరల్చే వాడా! నీ విధేయతపై నా హృదయానికి స్థిరత్వాన్ని ప్రసాదించు".

"హృదయం శరీరావయవాలకు సర్దారు, కమాండర్ వంటిది. అది గనక బాగుంటే దాని సైన్యం (అవయవాలు) సయితం బాగుంటుంది. అది గనక చెడితే దాని సైన్యం కూడా చెడుతుంది" అన్నారు హజ్రత్ అబూ హురైరహ్ (ర).

## ఖుర్ఆన్‌లో హృదయం

ఖుర్ఆన్ మనసుని మూడు విధాలుగా పేర్కొంటుంది. 1) నఫ్సుల్ అమ్మారహ్: చెడుకై పురిగొలిపే మనసు. 2) నఫ్సుల్ లవ్వామహ్: నిందించే మనస్సు. 3) నఫ్సుల్ ముత్‌మయిన్నహ్: ప్రశాంత హృదయం, నెమ్మదించిన మనస్సు.

ఖుర్ఆన్ ఉపదేశాలను అర్థం చేసుకోకపోవడానికి కారణం-వారి హృదయాలకు తాళాలు పడి ఉండటమే. వారి చర్మ చక్షువులకు అంధత్వం లేదు వారి అంతః చక్షువులు మూసుకు పోయాయి. ఆ కారణంగానే వారు సత్యాన్ని సత్యంగా చూడలేకపోతున్నారు. అసత్యం అసత్యంగా వారికి తోచడం లేదు. కారణం వారి హృదయం రోగ గ్రస్తమవ్వడమే. అందుకే తరచూ ప్రవక్త (స) ఈ దుఆ చేస్తూ ఉండేవారు: "అల్లాహుమ్మ అరినల్ హఖ్ఖ హఖ్ఖన్ వర్‌జుఖ్నత్తి బాఅ వ అరినల్ బాతిల బాతిలన్ వర్‌జుఖ్నజ్‌తినా బహ్"-(ఓ అల్లాహ్! మాకు సత్యాన్ని సత్యంగా చూపించు మరియు దాన్ని అనుసరించే సద్బుద్ధిని ఒసగు. అసత్యాన్ని అసత్యంగా చూపించు మరియు దాన్నుండి ఎడంగా ఉండేలా మమ్మల్ని దీవించు)".

## హదీసులో హృదయం

"దాసుని విశ్వాసం ఎప్పటి వరకయితే అతని హృదయం దారికి రాదో అప్పటి వరకు దారికి రాదు" (ముస్నద్ అహ్మద్)

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం విశ్వాసం అంటే, "నోటితో పలకడం, మనస్సుతో అంగీకరించడం, శరీరావయవాలతో ఆచరణకు పూనుకోవటం". అంటే విశ్వాస రహిత హృదయం గల వ్యక్తి కర్మలు అవి ఎంత మంచివయినా ప్రయోజనం లేదు. విశ్వాసం హృదయంలో ఉందంటూ వట్టిమాటలు చెప్పి కర్మలకు దూరంగా ఉండే వ్యక్తి విశ్వాసం అంగీకృతం కాదు. ప్రవక్త (స) ఇలా అన్నారు:

"నిశ్చయంగా అల్లాహ్ మీ ముఖాలను, మీ శరీరాలను చూడడు. ఆయన మీ హృదయాలను, మీ కర్మలను తప్పకుండా చూస్తాడు". (ముత్తఫఖున్ అలైహి) ఆయన (స) హృదయం వైపు సైగ చేస్తూ. 'అత్తఖ్వా హాహునా' (తఖ్వా-దైవభీతి ఇక్కడున్నది) అని సెలవిచ్చారు. (ముస్లిం) "నీ వల్ల సాధ్యమయితే ఇది చెయ్యి. నీ హృదయంలో ఎవరి యెడల ఎలాంటి చెడు భావనకు చోటు ఇవ్వకు" అని తన సహచరులకు ఆయన చేసిన హితవు సయితం గమనార్హం.

## ప్రముఖుల దృష్టిలో హృదయం

"గొడవలు మోసే గుండెల నిండా అరుపులురా, కేకలురా" అని కవి చెప్పిన హృదయం గురించి ప్రముఖుల అభిప్రాయం.

"వివేకి నాలుక (మాట) అతని హృదయం వెనకాల ఉంటుంది. అదే అవివేకి హృదయం అతని నాలుక (మాట) వెనకాల ఉంటుంది" అన్నారు హజ్రత్ అలీ (ర).

"తన ముఖాన్ని రోజుకు అనేకసార్లు కడుగుతూ తన హృదయాన్ని ఏడాదికో సారి కూడా శుభ్రపరచుకోని వారిని చూస్తే నాకు ఆశ్చర్యం కలుగుతుంది" అన్నారు మీఖాయిల్ నఈమహ్.

"హృదయం నిండా అసూయ నిండినవాడు ఎన్నటికీ నాయకుడు కాలేడు" 'అల్ హసూదు లా యసూదు' అన్నది అరబ్బీ సామెత.

"నాలుక, మనస్సుకు మించిన మంచి వస్తువూ లేదు, అవి బాగుంటే. వాటికి మించిన చెడ్డ వస్తువు కూడా లేదు, అవి పాడయితే" అన్నారు లుఖ్మాన్ హకీమ్ (అ).

"స్వచ్ఛమయిన హృదయం- ఎవరి యెడలా చెడు తలంపు కలగనిది. అందరి మేలును ఆకాంక్షించేది" అన్నారు ఇమామ్ ఇబ్ను తైమియా (ర).

"ఏ హృదయంలోనయితే, కుళ్ళు, ఓర్వలేనితనం, అసూయ, ఆత్మస్తుతి, అహంభావం వేళ్ళూనుకొని ఉంటుందో ఆ హృదయం స్వచ్ఛందం కాజాలదు" అన్నారు ఇబ్నుల్ అరబీ (రహ్మ).

"ఆలోచించే మేధ మరియు స్పందించే హృదయం మేలు కలయికనే వివేకం అంటారు" అన్నది ఓ ప్రసిద్ధ ప్రతీతి.

"మన పూర్వీకులు గోరంత సత్కార్యానికి కొండంత పుణ్యాన్ని పొందేవారు. కారణం- వారి హృదయ స్వచ్ఛతే" అన్నారు ఇబ్ను కసీర్.

"హృదయాలు కుండను పోలి ఉంటాయి. వాటిలో ఉన్న భావాలను అవి వండుతుంటాయి. నాలుకలు వాటికి ముఖద్వారం వంటివి. ఒక వ్యక్తి మాట్లాడేటప్పుడు గమనించండి, అతని మనసులో ఉన్నదే మాట రూపంలో బయటికి వస్తున్నది. తీపి, చేదు, సుగంధం, దుర్గంధం మొదలయినవి. మనిషి నోటి మాట అతని హృదయ భావన రుచిని పరిచయం చేస్తుంది" అన్నారు యహ్యా బిన్ ముఆజ్ (రహ్మ).

“సజ్జనుల హృదయాలు మంచి ఆలోచనలతో నిండు కుండలయి ఉండగా. దుర్జనుల హృదయాలు చెడు తలంపులతో అతలాకుతలమవుతుంటాయి. ప్రజలారా! అల్లాహ్ మీ హృదయాలను, మీ ఆలోచనలను గమనిస్తున్నాడు. మీరు ఎలాంటి ఆలోచనలకు హృదయంలో తావివ్వాలో ఆలోచించుకోండి!” అన్నారు మాలిక్ బిన్ దీనార్ (రహ్మ).

“మనోవాంఛను గౌరవించిన వ్యక్తి తన ధర్మాన్ని కించపరుస్తాడు. మనో వాంఛను కించపరచిన వ్యక్తి తన ధర్మాన్ని గౌరవిస్తాడు” అన్నారు ముజాహిద్ (రహ్మ).

ఒకరి మనస్సులో ఏముందన్న విషయాన్ని మానవ హృదయాల్ని మరల్చే అల్లాహ్‌కు వదలి మన దేహంలాగే మన హృదయం సయితం రోగ బారిన పడుతున్న యదార్థాన్ని గ్రహించి దాని స్వచ్ఛత, మరియు స్వస్థత కోసం శక్తి వంచన లేకుండా పాటు పడదాం!

## హృదయ కాలుష్యానికి కారణాలు

1) నిజ దైవం పట్ల విశ్వాస లేమి. 2) అజ్ఞానం. 3) ఉపద్రవాలు. 4) తుచ్ఛ వాంఛలు. 5) ఏమరుపాటు 6) అత్యాశ. 7) లోభం. 8) అహం. 9) మదం. 10) మాత్సర్యం. 11) అనవసరమయిన ఉదారత్వం. 12) అధర్మ భూషణం, భాషణం. 13) రంధ్రాన్వేషణ. 14) అధర్మ విషయాలపై దృష్టి కేంద్రీకరణ. 15) ప్రపంచాన్నే సర్వస్వంగా భావించడం మొదలయినవి.

పై విషయాలు ఒక వ్యక్తి హృదయంలో చోటు చేసుకుంటే దానికి చుట్టు ముట్టే రోగాల జాబితా కూడా కాస్త జాస్తిగానే ఉంది.

## హృదయ రోగాలు

1) షిర్క్. 2) కాపట్యం.3) అనుమానం.4) సందేహం, అపోహ. 5) అసూయ, ద్వేషం. 6) అనవసర పౌరుషం.7) అహంభావం.8) ఆత్మస్తుతి. 9) ఏవగింపు, అవహేళన.10) కుళ్ళు, ఓర్వలేనితనం. 11) నిరాశ. 2) దైవేతరుల ప్రేమ. 13) దైవేతరుల భయం. 14) చెడు తలంపుల పరంపర.15) గుండె బండ బారడం.16) అసత్యానికి కొమ్ము కాయడం మొదలయినవి.

## హృదయ రోగ నివారణ

1) మనిషి తన విశ్వాసాన్ని పరీక్షించుకొని, ప్రక్షాళన చేసుకోవాలి. ఇమామ్ ఇబ్ను తైమియా (రహ్మ) ఇలా అన్నారు: “హృదయ రోగాన్ని దూరం చేసే విధానాల్లో అత్యుత్తమ శ్రేణికి చెందిన విధానం- మనిషి తన హృదయాన్ని అల్లాహ్ ప్రేమతో నింపుకోవడమే”.

**2) చిత్తశుద్ధి-అంకిత భావం** : ప్రవక్త(స) వారు సెలవిచ్చిన మాట గమనార్హం! “ఎవరయితే అల్లాహ్ కోసం ఇష్ట పడతారో, అల్లాహ్ కోసం ద్వేషిస్తారో, అల్లాహ్ కోసం మాత్రమే ఇస్తారో, అల్లాహ్ కోసం మాత్రమే ఇవ్వకుండా ఉంటారో వారు తమ విశ్వాసాన్ని పరిపూర్ణం చేసుకున్న వారవుతారు”. (అబు దావూద్)

**3) దైవప్రవక్త (స) వారి అనుసరణ** : “ఓ ప్రవక్తా! ఇలా ప్రకటించు: “మీరు నిజంగానే అల్లాహ్‌ను ప్రేమిస్తున్నట్లయితే మీరు నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు”. (ఆలి ఇమ్రాన్ : 31)

**4) ఆత్మ పరిశీలన** : “విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీలో ప్రతి ఒక్కరు తాను రేపటి కోసం ఏమి పంపించుకున్నాడో చూసుకోవాలి”. (హష్ర్:18)


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

**5) ధర్మ సంపాదన :** "నిశ్చయంగా అల్లాహ్ పరిశుద్ధుడు. పరిశుద్ధమయిన వాటినే స్వీకరిస్తాడు" అన్నారు ప్రవక్త (స). (ముస్లిం)

**6) హృదయ స్వచ్ఛత :** "స్వర్గంలో ప్రవేశించేవారు-వారి హృదయాలు పక్షుల హృదయాల్ని పోలి ఉంటాయి" అన్నారు ప్రవక్త (స) ముస్లిం)

**7) ఖుర్ఆన్ పారాయణం :** ప్రజలారా! మీ ప్రభువు తరపు నుంచి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. అది హృదయాలలో ఉన్న వ్యాధులకు స్వస్థత నొసగేది. నమ్మేవారి కోసం మార్గదర్శకం, కారుణ్యం". (ఖుర్ఆన్-10:57)

"నీళ్ళ తాకిడితో లోహానికి తుప్పు పట్టినట్టే హృదయానికి సయితం తుప్పు పడుతుంది. హృదయ తుప్పును వదలగొట్టే అసలు సాధనం ఖుర్ఆన్ పారాయణం" అన్నారు ప్రవక్త (స). (బైహఖీ)

## హృదయ స్వచ్ఛతకు గుర్తులు

1) అల్లాహ్ యెడల సంతుష్టులై ఉండటం. 2) పరలోకం పట్ల చింతన. 3) నిరంతర అల్లాహ్ స్మరణ. 4) మానవ సేవలో ఆనందం. 5) ప్రార్థన తప్పితే బాధ. 6) ఖుర్ఆన్ పారాయణం, నమాజు ద్వారా ప్రశాంతత. 7) బాహ్యంగా, రహస్యంగా ఒకే విధమయినటువంటి ప్రవర్తన. ప్రవక్త(స) అన్నారు: "కొందరున్నారు. వారు మీలాగే నమాజులు చేస్తారు, ఉపవాసాలూ పాటిస్తారు. రాత్రి జాగారాలూ చేస్తారు. కానీ అల్లాహ్ నిషేధించిన వాటితో వారు ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రం హద్దులన్నీ చెరిపేసి బరి తెగిస్తారు". (ఇబ్ను మాజహ్) 7) పాప మన్నింపుకై ఇస్తిగ్ఫార్ అత్యధికంగా చేస్తూ ఉండటం. 8) ఆరాధనా మాధుర్యాన్ని ఆస్వాదించడం. ప్రతి వస్తువుకు ఒక రుచి ఉన్నట్లే ఆరాధనకు సయితం ఒక రుచి ఉంటుంది. ఆ రుచిని స్వచ్ఛమయిన హృదయం గలవారు మాత్రమే ఆస్వాదించగలుగుతారు. 9) అధిక కర్మలు చేయాలన్న ఆత్రంకన్నా చేసే కర్మల్ని సంస్కరించుకొని పూర్తి నాణ్యతతో చెయ్యడం. అంటే కర్మల క్వాంటిటీని కాక పూర్తి క్లారిటీతో కర్మల క్వాలిటీపై దృష్టి సారించడం. 10) అందరూ బాగుండాలి. అందులో నేనుండాలి అనుకోవడం.

నిరంతర సాధన అనివార్యం! చుట్టూ పొంచి ఉన్న పెను ప్రమాదాలతో పోరాటం తథ్యం!!

సందు దొరికితే కబళించేందుకు మన చుట్టూ షైతాన్ మూకలు మోహరించి ఉన్నాయి. అవి మన మనో భూమి వైపునకు ఉపద్రవాల వెల్లువను మళ్లించేందుకు ఉవ్విళ్ళూరుతున్నాయి. మనం వాటిని చూడలేక పోయినా అవి మాత్రం మనల్ని చూస్తూ మన మనస్సును తమ వశీకరణలతో వశపర్చుకోవడానికి ఉరకలేస్తున్నాయి. "మనిషి హృదయంపై ఉపద్రవాలు ఆకాశం నుండి కుండపోతగా కురుస్తాయి" అన్న ప్రవక్త (స) వారి మాటకు నేపథ్యం ఇదే. "మనిషి నరనరాల్లో రక్తం కన్నా వేగంగా షైతాన్ ప్రవహిస్తూ ఉంటాడు" అని స్వయంగా ప్రవక్త (స) అన్నారంటే ప్రమాదం ఎంత ప్రమాదకరంగా ఉందో ఊహించొచ్చు. మనం మన తరపున రక్షణగా నిలిచి, ధర్మం ప్రబోధించిన సకల శస్త్రాలతో రేయింబవళ్లు యుద్ధం చేసి, శత్రువుపై విజయం సాధించే కాంతి పెరిగితే ఆత్మ జ్యోతి దేదీప్యమానం అవుతుంది. శత్రువును మట్టి కరిపించే ఆంతరంగిక శక్తి మనలోని ప్రతి ఒక్కరిలోనూ ఉంది. ఈ శక్తి మన అసలు మనుగడకు, హృదయ స్వచ్ఛతకు, పరలోక సాఫల్యానికి మూలం. ఈ మానసిక శక్తినే ఖుర్ఆన్ 'నఫ్సె లవ్వామహ్'- ఆత్మఘోష అంటుంది. అదే ఈ ఆత్మఘోష గొంతును నొక్కేస్తే మన హృదయం రోగ బారిన పడుతుంది. అది నీరసించిన మరుక్షణం 'నఫ్సె అమ్మారహ్'- దుష్టాత్మ విజృంభిస్తుంది. అది చెలరేగిందా మనిషి ఆధ్యాత్మికతను చింపిన విస్తరిని చేస్తుంది. కాబట్టి ఆత్మఘోషను కాపాడుకోవాలి.హృదయ స్వచ్ఛతకు ఇది ఎంతో కీలకం.

## చివరి మాట

దేహ రోగాలు ఎన్నున్నా, ఎంత భయంకరమైనవై ఉన్నా మరణంతో అంతమయి పోతాయి. కానీ హృదయ రోగ ఇబ్బందులు అసలు మరణం తర్వాతనే మొదలవుతాయి. కాబట్టి మన హృదయాలను కాలుష్య బారిన పడకుండా కాపాడుకోవాలి. అల్లాహ్ నేర్పిన దుఆతోపాటు ప్రవక్త (స) తరచూ చేసిన ప్రార్థన మనం కూడా చెయ్యాలి.

"రబ్బనగ్ఫిర్‌లనా వలి ఇఖ్వానినల్లజీన సబఖూనా బిల్ ఈమాన్ వలా తజ్అల్ ఫీ ఖులూబినా గిల్లల్ లిల్లజీన ఆమనూ రబ్బనా ఇన్నక రవూఫు ర్రహీమ్"- "మా ప్రభూ! మమ్మల్ని క్షమించు. మాకన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి కల్మషాన్ని కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదు స్వభావం కల వాడవు, కనికరించేవాడవు". (అల్ హష్ర్: 10)

"అల్లాహుమ్మజ్అలిల్ ఖుర్ఆన రబీఅ ఖల్బీ వ నూర సద్రీ, వ జహాబహుమూమహు, వ గుమూమహు"-ఓ అల్లాహ్! ఖుర్ఆన్‌ను నా మనో వసంతంగా చెయ్యి. దానిని నా ఆత్మజ్యోతిగా మార్చు. నా హృదయ కలతలను, బాధలను దూరం చేసేదిగా చెయ్యి". ఆమీన్!

# విశ్వాసానికి చిహ్నం నమాజ్



- నసీరా బేగం

**విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య తేడాను చూపే గీటురాయి నమాజ్.** దైవప్రవక్త(స) ఈ విధంగా హితబోధ చేశారు అని హ|జ్రత్ అబూ దర్దా (ర) సెలవిచ్చారు: "ఓ అబూ దర్దా! అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరినీ, ఏ వస్తువునూ నిలబెట్టకు, ఒకవేళ నిన్ను ముక్కలు ముక్కలుగా నరికి వేసినా సరే. లేదా అగ్నిలో పడవేసి మాడ్చివేసినా సరే". ఇంకా ఇలా సెలవిచ్చారు: "జాగ్రత్త! ఉద్దేశపూర్వకంగా నమాజును ఏనాడూ విడిచిపెట్టకు. ఎందుకంటే ఎవడైతే ఉద్దేశ పూర్వకంగా నమాజును విడిచి పెడతాడో అల్లాహ్‌పై ఉన్న విశ్వాసులైన ప్రజల బాధ్యత నుంచి అతను వైదొలగిపోతాడు. జాగ్రత్త! ఏనాడూ మద్యాన్ని సేవించకు. ఎందుకంటే అది చెడులన్నింటికీ మూలం".

హ|జ్రత్ ఉస్మాన్(రజి) ఇలా సెలవిచ్చారు: ఒక మనిషి నమాజును క్రమం తప్పకుండా సమయం కాగానే చేసినట్లయితే అతనికి అల్లాహ్ తొమ్మిది రకాల అంతస్తులను ప్రసాదిస్తాడు. 1) అల్లాహ్ అతన్ని ప్రేమిస్తాడు 2) అల్లాహ్ అతనికి ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడు 3) దైవదూతలు అతన్ని పర్యవేక్షిస్తూ ఉంటారు 4) అతని గృహంలో శుభాలు అవతరిస్తాయి 5) అతని ముఖంపై సజ్జనుల ముఖాలపై ఉండే సూచనలు కనిపిస్తాయి 6) అతని మనసును అల్లాహ్ మృదువైనదిగా చేస్తాడు 7) ప్రళయ దినం నాడు పుల్‌సిరాత్ అనే వారధి పైనుంచి కరెంటు మాదిరిగా అత్యంత వేగంగా అతను ప్రయాణిస్తాడు 8) ఇంకా అతను నరకాగ్ని నుండి రక్షింపబడతాడు 9) దుఃఖానికి, బాధకు అతీతులైన ప్రజల సాంగత్యాన్ని అల్లాహ్ అతనికి ప్రసాదిస్తాడు. అంటే అతనికి సజ్జనుల సాంగత్యం లభిస్తుంది.

హ|జ్రత్ ఉమర్(ర) ఇలా సెలవిచ్చారు: ఎవరైతే నమాజును పరిరక్షించుకున్నారో వారు తమ ధర్మాన్ని పరిరక్షించుకున్నారు. ఎవరైతే నమాజును పరిరక్షించుకోలేదో వారు తమ ధర్మాన్ని పరిరక్షించుకోలేదు. పనులన్నింటిలో అత్యంత జాగరూకతగా చెయ్యవలసిన పని నా దృష్టిలో నమాజు చెయ్యటం.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: నమాజ్‌లో పది శుభాలు అంతర్లీనమై ఉన్నాయి. 1) అందమైన ముఖారవిందం 2) హృదయానికి కాంతి 3) శరీర సుఖం 4) సమాధిలో సాన్నిహిత్యం 5) కారుణ్యావతరణం 6) ఆకాశపు తాళం చెవి 7) మీజాన్ త్రాసులో బరువు తూగటం 8) దైవప్రసన్నత 9) స్వర్గం విలువ 10) నరకాగ్ని నుండి రక్షణ.

మూడు విషయాలను ఆచరిస్తే అవి పాపాలకు పరిహారంగా పనికొస్తాయి అని దైవప్రవక్త (స) సెలవిచ్చారు: 1) చలికాలంలో ఉదయపు నమాజు కోసం చక్కగా వుజూ చేసుకోవటం 2) నమాజు జమాఅత్‌తో చెయ్యటం కోసం నడిచి వెళ్ళటం 3) ఒక నమాజు చేసిన తరువాత మరొక నమాజు కోసం ఆతృతతో ఎదురు చూడటం.

మనిషి నమాజు చేసినట్లయితే అతనికి తప్పకుండా పుణ్యం లభిస్తుందనేది సత్యం. కాని నమాజు సమయం కోసం వేచి ఉన్న మనిషికి అతను వేచి ఉన్నంత సమయం కూడా అల్లాహ్ దృష్టిలో అత్యంత విలువైనది. ఈ విలువైన సమయం కోసం కూడా అల్లాహ్ అనంతమైన పుణ్యఫలాలను ప్రసాదిస్తాడు. ఆ సమయాన్ని ఆయన ఎంతో గౌరవిస్తాడు. ప్రళయ దినం నాడు

దైవపీఠం క్రింద తప్ప ఎక్కడా నీడ అంటూ లేనప్పుడు అటువంటి వ్యక్తికి అల్లాహ్ తన పీఠం క్రింద స్థలాన్ని కేటాయిస్తాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: నమాజు సమయం కోసం వేచి ఉన్న మనిషి నమాజు సమయం అయ్యేకాలం వరకు నమాజుకు లభించేంత పుణ్యం పొందుతూ ఉంటాడు. ఇంకా అతని కోసం దైవదూతలు, 'ఓ అల్లాహ్! ఇతనిని క్షమించు. ఇతనిపై కరుణ జూపు' అని ప్రార్థిస్తూ ఉంటారు. అతను నమాజు ముగించుకున్న తరువాత కూడా వుజూ స్థితిలో ఉండి నమాజు స్థలంలో కూర్చుని ఉన్నంతవరకు దైవదూతలు అదేవిధంగా ప్రార్థిస్తూ ఉంటారు. (బుఖారీ) ఇంకా ఆయన(స) ఇలా సెలవిచ్చారు: ఎవరైనా ఒక మనిషి ఒక నమాజును ముగించుకున్న తరువాత మరొక నమాజు కోసం వేచి ఉన్నట్లయితే అతని ఉపమానం, గుర్రంపై ఎక్కి అల్లాహ్ మార్గంలో వేగంగా స్వారీ చేస్తూనే ఉన్న యోధుడి మాదిరిగా ఉంటుంది. ఇంకా నమాజు కోసం వేచి ఉండే అతని మనస్సు షైతాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ ఉంటుంది. (ముస్నద్ అహ్మద్)

ఒక ధనవంతుడు, గొప్పవాడు అయిన మనిషి మమ్మల్ని విందు భోజనానికి పిలిస్తే మనం దానిని అత్యంత గౌరవ ప్రదమైనదిగా భావిస్తాము. ఆ విందుకు తప్పకుండా హాజరయ్యే ప్రయత్నం చేస్తాము. వీలు చేసుకుని సమయానికి ముందే చేరుకుంటాం. ఎటువంటి అలసత్వాన్ని దరిచేరనీయము. అదే విధంగా ఒక మనిషి నమాజు కోసం మస్జిదుకు వెళుతున్నాడంటే, అతను కారుణ్య ప్రభువు పిలుపు వైపునకు పరుగెడుతున్నాడు అన్నమాట. గౌరవప్రదుడు, మహోన్నతుడు అయిన అల్లాహ్ ఆహ్వానాన్ని స్వీకరిస్తున్నాడు అన్నమాట. సర్వోన్నతుడు, సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ మనల్ని ఆహ్వానిస్తున్నాడంటే మామూలు విషయం కాదు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు, ఒక మనిషి చక్కగా వుజూ చేసుకుని మస్జిదుకు చేరుకున్నట్లయితే అతను అల్లాహ్ అతిథిగా అక్కడకు చేరుకున్నాడు (తిబ్రాని). సర్వాధికారాలు తన గుప్పెట్లో ఉన్న ఆ అల్లాహ్ అతిథిగా వెళ్ళినట్లయితే ఇక అక్కడ లభించని వస్తువంటూ ఏదైనా ఉంటుందా? ఇక ఆ ఆహ్వానాన్ని త్రోసిపుచ్చి వెళ్ళకుండా ఉన్నట్లయితే ఆ నష్టాన్ని పూరించే శక్తి గల మరొక వస్తువు ఏమైనా ఉంటుందా? ఒక గొప్పవాడు, ప్రముఖుడు అయిన వ్యక్తి ఆహ్వానాన్ని స్వీకరించి అతని అతిథిగా అతని ఇంటికి వెళ్ళినప్పుడు అతను గౌరవ ప్రదంగా, సంతోషంగా మనకు స్వాగతం పలికినట్లయితే మన సంతోషానికి అవధులుంటాయా? కాని ఇక్కడ అల్లాహ్ తన ఆహ్వానాన్ని స్వీకరించి తన గృహానికి, అంటే మస్జిదుకు తన భక్తుడు వచ్చినట్లయితే అంతకంటే ఎక్కువగా సంతోషిస్తాడు, స్వాగతిస్తాడు. ఈ విషయాన్ని దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: 'ఒక మనిషి చక్కగా వుజూ చేసుకుని కేవలం నమాజు చెయ్యాలనే సంకల్పంతో మస్జిదులోనికి ప్రవేశించి నట్లయితే అల్లాహ్ ఆ వ్యక్తి పట్ల అమితా నందభరితుడవుతాడు. ఒక మనిషి తనకు అత్యంత దూరంగా ఉన్న తన బంధువు తన ఇంటికి వచ్చినప్పుడు ఏ విధంగానైతే అమితానందభరితుడవుతాడో ఆ విధంగా' (ఇబ్నె ఖుజైమా). అల్లాహ్‌యే నమాజు చేసే తన భక్తుడితో ఇంతగా సంతోషిస్తే, తన ప్రభువు సంతోషాన్ని పొందే వ్యక్తి ఎంతగా సంతోషించాలి? ఎంతగా కృతజ్ఞతలు సమర్పించుకోవాలి?


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**ఆ**రోగ్యం దైవం ప్రసాదించిన మహత్తర వరప్రసాదం. చెదలు పుస్తకాలను హరించినట్లే అనారోగ్యం తనువును స్వాహా చేస్తుంది. అందుకే అనారోగ్యాన్ని ఏమాత్రం ఉపేక్షించ రాదు. మానవుడు మనుగడ సాగించాలంటే ఆరోగ్య పునాది పటిష్టంగా ఉండాలి. అసలు మనిషి ఆనందానికీ, ఉల్లాస జీవితానికి, చురుకుతనానికి కేంద్ర బిందువు ఆరోగ్యమే. ప్రముఖ చరిత్ర కారుడు డౌగ్లస్ గుత్రీ మధ్యప్రాచ్య దేశాలు వైద్యంలో ఎంతో అభివృద్ధి పథంలో నడవడానికి ముఖ్య కారణం ప్రవక్త ముహమ్మద్(స) బోధనలే అని తేల్చి చెప్పాడు. ప్రవక్త (స) ఉపదేశాలు గుర్తు చేస్తూ రోగానికి మందులు వాడండి, అల్లాహ్ ప్రతి వ్యాధికి ఓ నివారణ చూపాడు అన్నారు. డౌగ్లస్ ఈ సందర్భంగా పలు తిర్మిజీ హదీసులు ఉటంకించాడు.

ప్రవక్త ముహమ్మద్ (స) ఆరోగ్యం, వైద్యం, మందులు, పరిశుభ్రతపై ప్రవచించిన విషయాలను క్రోడికరించి "తిబ్బె నబవీ" (ప్రవక్త వైద్య విధానం)గా పిలుస్తారు. యాభైకి పైగా ప్రవక్త(స) ప్రత్యేక సంప్రదాయాలు, రోగ విరుగుడు విధానాలు 'కితాబ్-అల్-తిబ్' అనే పుస్తకంలో క్రోడీకరించడం జరిగింది. ఈ గ్రంథంలో పరిశుద్ధత, పరిసరాలు, ఆహార అలవాట్లు లాంటి 400 అంశాల వారీగా ద్రవ పదార్థాలు (కితాబుల్ అష్రిబా), ఆహారం (కితాబుల్ అత్‌యిమహ్), వస్త్రాలు (కితాబుల్ లిబాస్), పరిశుభ్రత (కితాబుల్ తహారహ్), స్త్రీ ఋతుక్రమం (కితాబుల్ హైజ్), అంత్యక్రియలు (కితాబుల్ జనాజా), వ్యాధులు (కితాబుల్ మర్జ్) మొదలగునవి ఉన్నాయి. ఇంకా ఇలాంటి ఎన్నో ప్రవక్త (స) వైద్య విధానాలను ఇబ్నుల్ ఖయ్యిమ్ అల్ జుహ్రీ (హిజ్రి 8), అబూ నుఅయ్‌మ్ (హిజ్రి 5), అబూ అర్జల్లాహ్ అల్ జహబీ (8 హిజ్రి), అబూ బక్ర్ ఇబ్నె అల్ సాని (హిజ్రి 4), అబ్దుర్రహ్మాన్ అస్ సుయూతీ (హిజ్రి 9) మొదలగువారు తమ గ్రంథాలలో విశదీకరించారు. అరబీలోని ఈ గ్రంథాలు ఎన్నో ఇంగ్లీషు తదితర భాషలలో అనువదించబడడం వల్ల ఈ వైద్య విధానాలు మరింత పరిశోధనకు నోచుకొని ప్రాశస్త్యం పొందుతున్నాయి.

రోగానికి వైద్యం తీసుకుంటూ అల్లాహ్ సహాయం అర్థిస్తుండాలి తప్ప భూత వైద్యం దరిచేరొద్దని ప్రవక్త ముహమ్మద్ (స) సెలవిచ్చారు. ఆ కాలంలో ప్రజలు వైద్యం కన్నా మంత్రతంత్రాల వైపు ఎక్కువ మొగ్గేవారు. తరచూ రోగులను పరామర్శించడం ప్రవక్త(స) సంప్రదాయంగా ఉండేది. ప్రజలను కూడా రోగులను పరామర్శించండని చెప్పేవారు. రోగులు మందులు సేవించాలని ప్రవక్త(స) సలహాలిచ్చేవారు. ఓసారి సాద్ బిన్ వఖ్ఖాస్ గుండెపోటుతో అనారోగ్యానికో గురి అయినప్పుడు ఆ కాలంలో ప్రముఖ వైద్యుడుగా వెలుగొందిన యూదుడైన హారిస్ బిన్ కలదా వద్ద వైద్యం పొందమని పంపినారు. ప్లేగు, కలరా లాంటి

అంటు వ్యాధులు ఉన్నపుడు దాని వ్యాప్తిని అరికట్టే ప్రయత్నం చేయాలనీ, రోగ భయంతో ఊరు వదలి వెళ్ళరాదని ఇది పిరికితనమేకాక ఇతర చోట్ల వ్యాధి ప్రబలవచ్చని దైవ హెచ్చరికగా వారించారు కారుణ్యమూర్తి(స). శారీరక ఆరోగ్యం సహకరించనపుడు ఆత్మస్థైర్యం కోసం దుఆ, ఖురాన్ ఆయత్‌లు చదివితే తప్పక ఉపశమనం పొందుతారని ముహమ్మద్ (స) వివరించారు. వైద్యులు సైతం రోగి పట్ల శ్రద్ధ, బాధ్యతగా వైద్యం అందించాలని హితవు పలికారు.

ప్రవక్త ముహమ్మద్(స) ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యతగా గుర్తు చేసేవారు. అనారోగ్యం చోటు చేసుకోక ముందే ఆరోగ్యాన్ని మేలయినదిగా భావించమని హితవు పలికారు. జీవితం ప్రతి క్షణం దైవాంకితం, ప్రతి ఆరాధనలో ఆరోగ్యం అంతర్భాగమే! సున్తీ చేయించుకోవడం వల్ల మర్మావ యవ వ్యాధుల నుండి సురక్షితంగా ఉండవచ్చని ఆధునిక పరిశోధనలు తేటతెల్లం చేశాయి. గోళ్ళు, నాభిక్రింది వెంట్రుకలు తొలగిం చడం వల్ల ఎన్నో రకాల చెడు బ్యాక్టీరియా దరి చేరకుండా వారించవచ్చు. గడ్డం ఆరోగ్య మర్మం ఆరోగ్య భరితం. "పరిశుద్ధంగా ఉండేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు"-(తౌబా). ఐదు పూటల నమాజ్ వల్ల కన్ను, గుండె, కీళ్ళు, ఒబేసిటి లాంటి ఎన్నో జబ్బులకు చెక్ పెట్టవచ్చు. అన్నిటికి మించి మానసిక బలానికి నమాజ్ గొప్ప ఔషధం. ప్రవక్త ఆచరణలలో ఎన్నో ఆరోగ్య సూత్రాలు ఇమిడి ఉన్నాయి. భోజనం చేసే విధానంలో పావుభాగం కడుపు ఖాళీగా ఉంచాలి, బాగా నమిలి ప్రశాంతంగా మింగాలి. మూడు శ్వాసలలో నీరు కూర్చుని త్రాగడం, వుజూచేసి కుడి వైపు తిరిగి పడుకోవడం అన్నీ ఆరోగ్య సూత్రాలే! ఇవన్నీ ప్రవక్త చెప్పినవే!!

మహాప్రవక్త (స) వద్ద సహచర గణం ధార్మికంగానే గాక ఆరోగ్య పరమైన సలహాలూ తీసుకునేవారు. ప్రవక్త స్వయాన తాను ఆచరించిన ఆరోగ్య చిట్కాలు అనుచరులకు తెలిపేవారు. శరీర అలసటకు బార్లీ జావ తీసుకోమని, మలబద్ధకానికి సనా ఆకు చూర్ణం తీసుకోమని సూచించారు. బీట్ రూట్ మంచి ఆహారం అని అలీ(ర)తో అనేవారు. దంతాల పటిష్టత కోసం మిస్వాక్‌తో దంతావధానం చేయండని చెబుతు ఆచరించి చూపారు. శరీర పటుత్వం కోసం ప్రవక్త (స) తరచుగా తేనె తీసుకునేవారు. ఒకసారి ఓ మహిళ తన పిల్లవానికి గొంతు ఇన్ఫెక్షన్ వల్ల రక్తం వస్తుందంటే అల్లం దంచి నోట వుంచమని సూచించారు. ఓమారు ప్రవక్త(స) తేలు కుడితే వేడి నీటిలో ఉప్పు కలిపి తీసుకుని రమ్మని ఆ ద్రావణం తేలు కుట్టిన చోటపోసి రెండు ఖురాన్ వాక్యాలు చదివారు. హిజామా (కప్పింగ్ థెరపి) యునాని వైద్యంలో ఇప్పటికి మంచి మన్నన పొందుతోంది. ప్రకృతి సహజ మూలికలు అయిన వాము, అల్లం, ఆలీవ్ లాంటివి వివిధ రూపాల్లో వాడమని ప్రవక్త వివరించేవారు. అన్ని ఆరోగ్య రుగ్మతలకు పరిశుభ్రత మూలమని నుడివారు. పరిశుభ్రత సగం విశ్వాసం అని ఆయన(స) నొక్కి చెప్పారు. కలోంజి గింజలతో ఒక్క మరణం తప్ప అన్ని రోగాలు దూరమవుతాయని ప్రకటించారు. రోగి వ్యాధితో భయపడరాదు. ఆత్మస్థైర్యం కోల్పోరాదు.

ఒకసారి ఒక యువకుడు నిస్సత్తువగా నత్తనడక నడుస్తూ ఉంటే హజ్రత్ ఉమర్ (ర) "నీకేమయినా వ్యాధి ఉందా?" అని ప్రశ్నించగా ఆ యువకుడు లేదే అన్నాడు. అపుడు హజ్రత్ ఉమర్ (రజి) కొరడా ఝుళిపించి "నడిచేటప్పుడు బలంగా, యువకునిలా నడువు" అని ఆదేశించారు. అల్లాహ్‌కు బలహీనమైన విశ్వాసి కన్నా ధృడమైన విశ్వాసి అంటే ఎక్కువ ఇష్టం. ధార్మికత ప్రదర్శిస్తూ అతి ఉపవాసం ఉండడాన్ని వారించారు ప్రవక్త(స). ఆరోగ్యం కోసం రాత్రి పెందలకడనే నిద్రపోవటం, ఉదయం పెందలాడే మేల్కొనడం అలవాటు చేసుకోవాలని ముహమ్మద్ (స) తాకీదు చేశారు.

అనివార్య కారణాల వల్ల 5-1-2024 సంచికను ప్రచురించలేకపోయినందుకు చింతిస్తున్నాము. పాఠకులు గమనించగలరు.
- ఎడిటర్



# ప్రతిఘటనలో దైవ సందేశ ప్రచారం

**- సయ్యిద్ అజహరుద్దీన్**

**గత** ఏడు దశాబ్దాలు నుండి పాలస్తీనా సమస్య గురించి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు చర్చిస్తున్నారు. ఈ సమస్య గురించి ఎల్లప్పుడు మీడియాలో ముఖ్యాంశంగా చర్చ జర్గుతూనే ఉంటుంది. దీని గురించి కొందరు నిజాలు మాట్లాడుతున్నారు, మరికొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. కొంతమందికి ఈ విషయం గురించి ఏమి తెలియదు. అయితే అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన ఘటన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా దీని గురించి మరింత చర్చ జరుగుతున్నది.

రెండు నెలల తర్వాత వివిధ వార్తా నివేదికల ప్రకారం 46 వేల మందికి పైగా అమరులయ్యారు, 17 వేల మందికి పైగా గాయపడ్డారు. అమరులలో 70% మంది పాలస్తీనా మహిళలు, పిల్లలు ఉన్నారు. ఇటు ఇజ్రాయిల్లో కనీసం 14 వందల మంది చంపబడ్డారు, 1200 మందికి పైగా ఇప్పటి వరకు గాయపడ్డారు. (23 నవంబర్ 2023 నాటి యూఎన్ నివేదిక)

దైవ సందేశం కేవలం మాటల ద్వారానే కాకుండా అల్లాహ్‌పై మనకున్న దృఢమైన విశ్వాసంతో కూడా వ్యక్తపరచవచ్చు. పాలస్తీనియన్లు ప్రతిఘటన ద్వారా, మొక్కవోని స్థిర పోరాటం ద్వారా తమ స్వంత హక్కుల కోసం పోరాడుతూ దైవ సందేశాన్ని ఎలా ప్రచారం చేయవచ్చో ప్రపంచానికి చూపించారు.

చాలా మంది ప్రజలు ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌ల వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ముఖ్యంగా యూరోపియన్లు, అమెరికన్లు పాలస్తీనీయుల గురించి చెబుతున్న మాటలు ఇంత కఠినమైన పరిస్థితుల్లో కూడా పాలస్తీనీయులు బలమైన విశ్వాసాన్ని కలిగి ఉన్నారు. ఇంకా వారి కుటుంబ సభ్యులు అమరులైతే ఆ అమరులను జాగ్రత్తగా చూసుకోవాలని దేవుని వేడుకుంటున్నారు. ఏ ఒక్కరు కూడా దేవుడు మాతో ఇలా ఎందుకు చేస్తున్నాడో అని ఫిర్యాదులు వ్యక్తం చేయటంలేదు. అందుకు బదులుగా దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ దృఢమైన విశ్వాసాన్ని ముస్లిమేతరులు చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇస్లాం అంటే ఏమిటి? ఇస్లాం గురించి తెలుసుకోవాలని అనేకమంది ప్రజలు పవిత్ర ఖుర్‌ఆన్‌ను కొంటున్నారు.

గాజాలో జరుగుతున్న మారణహోమం తర్వాత దివ్య ఖురాన్ ట్రెండింగ్ టాపిక్‌గా మారింది.

యునైటెడ్ స్టేట్స్‌లోని ఫ్లోరిడాకు చెందిన ఇంటర్నెట్ కామిక్ ఆర్టిస్ట్, ఫ్యాషన్ డిజైనర్ అయిన 'నెఫెర్టారి మూన్' ఈ నెల ప్రారంభంలో ఇస్లాంను స్వీకరించింది, అయితే ఆమెను ఏ విషయం ఇస్లాం స్వీకరించేలా చేసిందో ఆమె ఇలా తెలియ జేసింది."నేను ఇస్లాం వైపునకు మరలడానికి ఇజ్రాయిల్ పాలస్తీనీయులపై చేస్తున్న మారణహోమం, పాలస్తీనా ప్రజల విశ్వాసం, సహనం, ధైర్య సాహసాలు ఒక బలమైన కారణమని చెప్పింది. పాలస్తీనీయులు అనుభవిస్తున్న దౌర్జన్యాలు ఆ స్థితిలో కూడా వారు అల్లాహ్‌పై వారు చూపుతున్న దృఢ విశ్వాసం చూసి నేను చాలా ప్రభావితం అయ్యాను అని చెప్పింది. పాలస్తీనీయులు తమ విశ్వాసాన్ని విడిచిపెట్టలేదు. ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా వారు విశ్వాసాన్ని దృఢంగా పట్టుకొని నిలకడగా ఉన్నారు. వారి చివరి శ్వాసలో కూడా వారు అల్లాహ్‌ను స్మరిస్తూనే ఉన్నారు అని ఆమె పేర్కొంది.

మూన్ పాలస్తీనీయులను ఉద్దేశిస్తూ ఇలా చెప్పింది: నేను మీకు చెబుతున్నాను ప్రస్తుతం ప్రపంచం మొత్తం మీకు మద్దతు పలుకుతుందని మీరు తెలుసుకోవాలి. మీరు చాలా కఠినమైన సమయంలో ఉన్నారు. సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. మీరు అనుభవిస్తున్న ఈ బాధను నేను అర్థం చేసుకోగలను మేమంతా మీ కోసం ప్రార్థిస్తున్నాము. - నెఫెర్టారి మూన్

యునైటెడ్ స్టేట్స్‌లోని చికాగోలో నివసించే ఒక ఆఫ్రికన్ అమెరికన్ యువతి టిక్‌టాక్ ఇన్‌ఫ్లుయెన్సర్ మిగావ్ బి రైస్ అక్టోబర్ 7న గాజాలో జరిగిన సంక్షోభాన్ని చూసి ఆమె సోషల్ మీడియాలో తన ప్రేక్షకులతో మానవతా సంక్షోభం గురించి మాట్లాడటం ప్రారంభించింది. ఆమెకు చదవడం అంటే ఎంతో ఇష్టం అయితే తన అనుచరులలో కొందరు తనను ఖురాన్ చదవమని సూచిం చారు, ఆపై ఆమె సామాజిక మాధ్యమం అయిన డిస్కార్డ్‌పై 'వరల్డ్ రిలిజియన్ బుక్ క్లబ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇలా చాలా మంది సామాజిక మాధ్యమాల ద్వారా ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదవాలని ఆసక్తిని వ్యక్తపరుస్తున్నారు. ప్రధాన మీడియా, సోషల్ మీడియా ద్వారా దీర్ఘకాలం నుండి అపార్థాలకు గురైన ఇస్లాం గురించి బాగా అర్థం చేసుకోవాలని, గాజాలోని అనేక మంది ముస్లింలకు మద్దతు తెలిపేందుకు యువకులు ఖుర్‌ఆన్‌ను చదువుతున్నారు.

నేను కేవలం ఒక్క నెలలోనే ఇస్లాంను స్వీకరించాను అన్నారు మేగాన్ బి రైస్.

ఇస్లాం పట్ల పాలస్తీనియులదృఢమైన విశ్వాసం వారికి స్ఫూర్తి అని చాలా మందికి చెబుతున్నారు. వాటి కొన్ని ఉదాహరణలు:

1. సోషల్ మీడియలో ఒకరు ఇలా చెప్పారు: "నేను ముస్లిమేత రుడిని నిన్న నేను ఖుర్‌ఆన్‌ను చదవడం ప్రారంభించాను నాకు చాలా ఆనందం కలుగుతున్నది, నేను పాలస్తినీయులకు మద్దతు తెలుపుతున్నాను."

2. ఒక వ్యక్తి టిక్ టాక్‌లో ఇలా చెప్పాడు : "నాకు ఈ సమస్య గురించి ఏమీ తెలియదు కానీ దీనిపై ఎక్కువగా అసత్య ప్రచారం జరుగుతున్నదని అర్థమవుతున్నది కాబట్టి దీని వాస్తవికత తెలుసుకోవడానికి నేను పరిశోధన చేస్తున్నాను.

3. మరో సోషల్ మీడియా వినియోగదారుడు ఇలా చెప్పాడు: "నేను 3 రోజుల క్రితం ఇస్లాంను స్వీకరించాను. ఇప్పుడు నేను ఇస్లాం గురించి మరింత నేర్చుకుంటున్నాను. ఖుర్‌ఆన్ విశ్వాసులకు ఔషధం.

4. ఇజ్రాయిల్‌కు చెందిన డేనియల్ అలోనీ అనే తల్లి తన 5 ఏళ్ల కుమార్తే ఎమిలియాకు హమాస్ సైనికులు అందించిన సంరక్షణ గురించి హమాస్‌కు హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతూ ఒక లేఖను వ్రాసింది. అందులో ఆమె ఇలా వ్రాసింది "నా కుమార్తె పట్ల మీరు చూపిన అసాధారణ మానవత్వానికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. మీరందరూ మంచివారు ఏమిలియాకు ప్రియమైన స్నేహితులని నేను అంగీకరిస్తున్నాను. చిన్న పిల్లలు బందిఖానాలో ఉండకూడదు, కానీ మీరు మంచి స్వభావం గల మనుషులు. నా కుమార్తె గాజా రాణిలా భావించానని నా కుమార్తె చెప్పింది. తనకు కలిసిన వారిలో ఏ ఒక్కరు కూడా అనుచితంగా వ్యవహరించలేదని అందరు ఆమె పట్ల కరుణతో వ్యవహరించారని చెప్పింది. అలోనీ చివరిగా లేఖలో హమాస్ పట్ల సానుభూతి చూపుతూ ఇలా వ్రాసింది: " మీరు గాజాలో చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉండి తీవ్రమైన నష్టాలు ఎదుర్కొంటున్నప్పటికి మీరు నా కుమార్తెతో మంచిగా వ్యవహరించారు మీ ఈ దయ గల ప్రవర్తనను నేను గుర్తుంచుకుంటాను."

పాలస్తీనియుల ఈ వ్యవహార శైలి ప్రపంచంలో ఇస్లాం గురించి తెలుసుకోవాలనే ఆసక్తిని ప్రేరేపిస్తున్నది.

ది అబ్జర్వర్ వెబ్‌సైట్‌లో సుమైయా ఖాన్ "ఇజ్రాయెల్ గాజాపై కురిపిస్తున్న బాంబుల వర్షం, పాలస్తీనియుల ప్రతిఘటనను చూసి ఖుర్‌ఆన్‌ను చదవాలని పెరుగుతున్న ఆసక్తి" అనే అంశం పై ఒక వ్యాసం వ్రాసింది. ఆమె పాలస్తీన ప్రజల పట్ల వారి విశ్వాసం పట్ల తన ప్రగాఢమైన అభిమానాన్ని వ్యక్తం చేస్తూ ఒక వీడియోను పోస్ట్ చేసింది. అందులో ఖురాన్ చదవమని వీక్షకులను ఆమెను ప్రోత్సహించింది. ఆ తర్వాత, ఆమె మొదటిసారి ఖుర్‌ఆన్ చదివిన అనుభవాన్ని పంచుకుంది, ఇతరులను చదవమని ఆహ్వానించింది.

ఎవాంజెలికల్ క్రిస్టియన్‌గా గుర్తించబడే మరో వినియోగదారుడు, మొదటిసారి ఖురాన్‌ను చదివాడు. ఖురాన్‌లోని కొన్ని వాక్యాలు అతన్ని ఆశ్చర్యపరిచాయని చెప్పాడు. ఇస్లాం గురించి పాశ్చాత్య దేశాలు చూపే కథనానికి ఇస్లాం ఎంతో భిన్నంగా ఉన్నదని గ్రహించానని చెప్పాడు.

పాశ్చాత్య దేశాల ప్రజలు ఖురాన్ ద్వారా ఇస్లాంను అన్వేషించడం ప్రారంభించారు.

అక్టోబర్ 7వ తేదీ తర్వాత, కొందరు ఈ సంఘటనను 9/11తో పోల్చడం ప్రారంభించారు, ఇంకా ఖురాన్, ఇస్లాం చర్చించుకోవడం ప్రారంభించారు. ఈ విషయమై గార్డియన్ జరీన్ గ్రేవాల్ (అసోసియేట్ ప్రొఫెసర్, యేల్ యూనివర్శిటీ)ని ఇంటర్వ్యూ చేసింది. ఆమె ఇలా చెప్పింది, 9/11 తర్వాత, ఖురాన్ తక్షణమే బెస్ట్ సెల్లర్‌గా మారింది, అయితే ఆ సమయంలో చాలా మంది అమెరికన్లు ఇస్లాం స్వాభావికంగా హింసాత్మకమైన మతం అని తమకున్న సందేహాన్ని నిర్ధారించడానికి దానిని కొనుగోలు చేశారు. కానీ అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే ప్రజలు హమాస్ చేసిన దాడిని అర్థం చేసుకోవడానికి ఖురాన్ వైపు మొగ్గు చూపడం లేదు, పాలస్తీనా ముస్లింలలో వారు చూసే అద్భుతమైన ధైర్యం, నిలకడ, విశ్వాసం, నైతిక బలం, వారి స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి వారు ఖురాన్ వైపు మొగ్గు చూపుతున్నారు.

అదేవిధంగా, సిల్వియాచాన్-మాలిక్ (అసోసియేట్ ప్రొఫెసర్, రట్జర్స్ యూనివర్శిటీ) ఇలా అన్నారు. 9/11 తర్వాత గ్రాడ్యుయేట్ స్కూల్‌లో ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత నేరాలు అధికమయ్యాయి. మీడియాలో విద్వేషం పెరిగింది. "పెర్ల్ హార్బర్ తర్వాత జపనీస్ అమెరికన్ల చరిత్రతో పోల్చి చూస్తే, ఏమి జరుగుతుందో అని చాలా ఆసక్తిగా ఉంది" అని ఆమె చెప్పింది. ఆ తర్వాత నేను "స్వతహాగా ముస్లింల గురించి ఇస్లాం గురించి అన్వేషించడం ప్రారంభించాను. మీడియాలో చూపే ముస్లిం కాకుండా నిజ ముస్లింలతో కలిసి వారి గురించి ఇస్లాం గురించి తెలుసుకున్నాను. నా అన్వేషణలో తేలిందేమంటే సత్యం ఒకటైతే మీడియా చూపేది ఒకటని గ్రహించి ఉలిక్కిపడ్డాను." ఇప్పుడు టిక్‌టాక్‌లో కూడా అదేవిధంగా జరుగుతున్నది. నా అనుభవం ద్వారా చెబుతున్నాను అప్పటి ఘటనలో ఇప్పటి ఘటనలోచాలా సారూప్యత ఉన్నది. నేను ఆ సమయంలో వార్తల్లో చూపే ముస్లింలకంటే నిజ ముస్లింలు చాలా భిన్నంగా ఉన్నారని ఆశ్చర్యపోయాను" అని ఆమె చెప్పింది.

మీరు ఇస్లాంను ఎంతగా అణచివేస్తారో, అంతగా ప్రజలు దానిని స్వీకరిస్తారు.

# జనం లెక్కిస్తూనే ఉంటారు, జాగ్రత్త!

**కె. శ్రీనివాస్**

**పరమ** మొరటుగా, దూషణభూషణ తిరస్కారాలతో వర్ధిల్లే మన రాజకీయరంగంలో ఉన్నట్టుండి కొన్ని సుభాషితాలు కూడా వినిపిస్తాయి. దళసరి చర్మధారులైపోయినవారు కూడా సున్నితత్వం గురించి చెబుతారు. దుమ్ముకొట్టుకుపోయిన వాతావరణంలోకి సంస్కారం, మన్నన, మర్యాద, మనోభావాలు, ఒకటనేమిటి అనేక మృదుమధుర పదాలు సీతాకోకచిలుకల్లా ఎగిరివస్తాయి.

ఎన్నికలైపోయాక 'దేశం దగాపడిన ఆడకూతురులా' ఉంటుందని పతంజలి తీవ్రాతితీవ్రంగా రాశారు. పోలింగ్ ముగిసే నాటికి ఓటరు చెవులూ కళ్లూ మనసూ పచ్చిపుండు అవుతాయి. హీలింగ్ టచ్ ఎవరికన్నా అవసరమంటే ప్రజలకే. కానీ, ఓడిపోయిన నాయకులకు ఓదార్పు ఇవ్వడమూ, గెలిచినవారికి కాసింత సమయమూ సహనమూ ఇవ్వడమూ జనం బాధ్యతే అవుతోంది.

ఓడిపోయారు కదా, ఇక వారి గతనేరాల గురించి తవ్వుకోవద్దులే, గెలిచింది ఇప్పుడే కదా, వారిని అప్పుడే తప్పెందుకు పట్టాలి? ఈ ప్రశ్నలు వర్తమాన రాజకీయ సంభాషణల్లో తరచు తారస పడుతున్నాయి. ఇవి, అధికార పోటీలో ఉన్న పక్షాల మధ్య ఉండవలసిన జమీందారీ మర్యాదలు మాత్రమేనా? ప్రజలు కూడా ఈ సున్నితాలను పట్టించుకోవాలా?

ఎందుకు పట్టించుకోవాలి? ప్రభుత్వం అనేది విరామం లేకుండా ఎప్పుడూ ఎట్లా కొనసాగుతూ ఉంటుందో, ప్రజల దగ్గర ఉండే సున్నితపు త్రాసు కూడా నిరంతరం తూకం వేస్తూనే ఉంటుంది. డిజటల్ సాధనాలలో గడియారం లాగా, అవధానంలో గంటల లెక్క లాగా ఒక నేపథ్య గణనం జరుగుతూనే ఉంటుంది. తెరవెనుక ఒక మీటర్ తిరుగుతూనే ఉంటుంది. తీవ్రస్పందనలు, ఆవేశకావేశాలు ఎప్పుడు వ్యక్తం కావాలో అప్పుడు అవుతాయి. ఎంచుకున్న కొత్త అధికారపార్టీ మీద జనం ఆశలు కొంతకాలం కొనసాగుతూ ఉంటాయి. ఇంతకాలం, ఎవరి వెంట మనసు నడిచిందో, వారిని వెంటనే వదిలివేయలేరు కదా? తోసిపుచ్చిన పాత ఏలికల మీద తిరస్కారభావం కూడా కొంతకాలం కొనసాగు తుంది. సానుకూలత క్షీణించడం కానీ, ప్రతికూలత సమసిపోవడం కానీ కాలక్రమేణా జరుగుతాయి, వారి వారి వ్యవహారసరళిని బట్టి, దిద్దుబాట్లను బట్టి. తప్పుల లెక్క మాత్రం ఏ గ్రేస్ పీరియడ్ లేకుండా జరుగుతూనే ఉంటుంది. పార్టీల పరస్పర సంబంధా లలో మర్యాదలు, విలువల చర్చతో మీడియాకూ విశ్లేషకులకూ మేత తప్ప మరో ప్రయోజనం లేదు.

మన ఎన్నికలలో ఒకరి విజయం, మరొకరి అపజయం అంటే, ఒక సమీకరణలోని బృందం సాధికారతను పొంది, మరొక సమీకృత బృందం అధికారాన్ని కోల్పోవడం. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనతో రాజకీయ యుద్ధం ముగిసిపోదు. ప్రజల సమ్మతిని కోల్పోయిన పాలనను తిరగదోడడం, ప్రజలు కోరుకున్న విధంగా సరిదిద్దడం, విధానాలకు చర్యలకు బాధ్యులను గుర్తించడం కొత్త ప్రభుత్వం తొలిమాసాలలో జరుగుతాయి. ఈ ప్రక్రియ సాగుతున్నంత కాలం కొత్త ప్రభుత్వానికి ప్రజలలో ఆకర్షణ కొనసాగుతూ ఉంటుంది. పాత పాలకపార్టీ ప్రతిష్ఠ మరింతగా దిగజారిపోతుంది. అదే సమయంలో, కొత్త ప్రభుత్వం కూడా తప్పులు చేయడం మొదలుపెడుతుంది. ప్రతిపక్షం వాటిని ప్రశ్నిస్తూ ఉంటుంది. ఈ కొత్త సంవాదం పుంజుకునే క్రమంలో పాత- కొత్తలు తెరవెనుకకు పోయి, ప్రస్తుత అధికార, ప్రతిపక్షాల చట్రం స్థిరపడుతుంది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాత ప్రభుత్వం విధానాలను, చర్యలను సమీక్షించడం మొదలుపెట్టింది. ప్రజలు ఆ పని జరగాలని కోరుకుంటారు. అదే సమయంలో, కొత్త వాగ్దానాల, విధానాల అమలు వేగంగా జరగకపోతే, కేవలం కక్ష సాధింపు ధోరణిగా భావిస్తారు. రెంటికీ సమతూకం పాటించవలసి ఉంటుంది.

భారత రాష్ట్రసమితి తెలంగాణ ఎన్నికలలో ఓటమిని ఊహించ లేదు. చివరి నిమిషం దాకా తన గెలుపు అనివార్యమైన, సహజమైన ఫలితమని అనుకుంటూ వచ్చింది. కాంగ్రెస్‌కు అధికారం దక్కడాన్ని జీర్ణించుకున్న తరువాత, త్వరత్వరగా అధికార పక్షం ప్రజల విశ్వసనీయత కోల్పోవాలని ఆత్రుత పడసాగింది. ఆరునెలల పాటు విమర్శా విరామం పాటిస్తామన్నవాళ్లు, ప్రభుత్వం పడిపోవడం గురించి, వాగ్దానాలను నెరవేర్చకపోవడం

గురించి అతి త్వరలోనే మాట్లాడడం మొదలుపెట్టారు. అటూ ఇటూ తొలినాటి మర్యాదలు తొలగిపోయి, వేగంగా రణరంగం రూపొందుతున్నది.

కేసీఆర్ శస్త్రచికిత్స కోసం ఆస్పత్రిలో చేరడం, సన్నివేశాన్ని కొంత ప్రభావితం చేసింది. విజేత పార్టీ దూకుడును నిగ్రహించింది. ఆ ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి రేవంత్‌రెడ్డి కేసీఆర్ సందర్శన ప్రయత్నించింది. ఆ తరువాత స్పీకర్ ఏకగ్రీవానికి సహకరిస్తామని చెప్పడం బీఆర్ఎస్ వైపు నుంచి మరొక మర్యాద. ఈ రాజకీయ యుద్ధంలో కొన్ని సున్నితాలు కూడా ఉన్నాయని తెలిసింది కానీ, కేవలం మర్యాదలే పాటిస్తే, గత ప్రభుత్వం మీద చేసిన విమర్శలకు న్యాయం చేయడం సాధ్యం కాదు. అందుకని, క్రమంగా, వేగంగా, తాను అనుకున్న పద్ధతిలో రేవంత్ రెడ్డి పనులు మొదలుపెట్టారు.

రాజకీయ విమర్శలను, సమర్థనలను రూపొందించే వాటిలో కేవలం పార్టీలు మాత్రమే ఉండవు. ప్రజాక్షేత్రంలో ఉండే అనేక సంస్థలు ఉంటాయి, బృందాలు, వ్యక్తులు ఉంటారు. పరాజయం వల్ల కలిగిన బాధతో బీఆర్ఎస్ బృందాలు తన విమర్శకులను దెప్పడం, హేళన చేయడం మొదలుపెట్టాయి. రేవంత్ రెడ్డి పాలన చేపట్టాక జరిగిన తప్పుల గురించి మాట్లాడరేం? అని ప్రశ్నించ సాగాయి. నిజానికి, ఈ ధోరణి ఆహ్వానించదగ్గదే! వివిధ శ్రేణులు ఒకరిమీద మరొకరు విమర్శ పెట్టడం సమాజం సరైన దారిలో నడవడానికి ఉపయోగపడుతుంది. పాలకులకు విమర్శ అందిస్తూ, ప్రతిపక్ష పాత్రలో ఉత్సాహంగా పనిచేయడానికి ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్‌ను అభినందించాలి. ప్రశ్నించడం నేర్చుకుంటే, తాము తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడు అది ప్రశ్నలను సహించగలిగే గుణంగా పరిణమించగలదు.

విమర్శ నుంచి లబ్ధి పొందగలిగినవారే వివేకులు. ప్రజలతో వ్యవహరించేవారు ప్రజల నుంచే మంచిచెడ్డల సమీక్షలను పొందాలి. ప్రియమైన అసత్యాలను చెప్పేవారిని చుట్టూ పేర్చుకున్న నాయకులు విమర్శ నుంచి లబ్ధిని పొందలేరు. నిజానికి వారు తమ ఆభిజాత్యం వల్ల ఎంతో కోల్పోతున్నారు. మంచిచెడూ చెప్పగలిగే చనువు సహచరులకు ఇస్తేనే నాయకులకు క్షేమం.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం రోజున జై తెలంగాణ నినాదాలు వినిపించకపోవడం, భారత రాష్ట్రసమితికే కాదు, సాధారణ ప్రజలకు కూడా లోటుగా కనిపించింది. ఆ సందడిలో మరచిపోయారేమో అనుకుంటే, శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి ముందు కూడా అధికారపక్షం నుంచి కొందరు మాత్రమే గన్‌పార్క్ సందర్శన చేశారు. నిజానికి ఎన్నికల ప్రచారం సందర్భంగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ ప్రస్తావనలు అనేక పర్యాయాలు చేశారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజులలోనే దేవరకొండ సమీపంలో చింతపల్లి దగ్గర జరిగిన లాకప్ డెత్ కొత్త ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చింది. ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా రేవంత్ రెడ్డి మానవ హక్కుల గురించి తరచు మాట్లాడుతున్నారు. సివిల్ వ్యవహారాలలో తలదూర్చవద్దని, ప్రజలతో వ్యవహరించేటప్పుడు దౌర్జన్య పద్ధతులు అనుసరించవద్దని ఆయన పోలీసు యంత్రాంగానికి ఒక సూచన చేసిఉంటే బాగుండేది. సచివాలయం ప్రాంగణంలో ఒక పాత్రికేయుడి మీద అధికారపార్టీ ఎమ్మెల్యే చేయి చేసుకున్నారని వచ్చిన వార్తలు ప్రభుత్వానికి కీర్తి తెచ్చేవి కావు. వెంటనే ఆ ఎమ్మెల్యేను మందలించి, కేసు నమోదు చేయించి ఉంటే 'మార్పు' ప్రస్ఫుటంగా కనిపించి ఉండేది. ఇవన్నీ తొలిరోజులలో ప్రజలు సీరియస్‌గా తీసుకోకపోవచ్చును. కానీ, ముందే చెప్పినట్టు, పనితీరు మీద మీటర్ ఒకటి జనం మనసుల్లో తిరుగుతూనే ఉంటుంది!

కొత్త ప్రభుత్వం తన ప్రాధాన్యాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులు చేపట్టడం, పాత ప్రాజెక్టులను విరమించుకోవడం చేయవచ్చు. తప్పేమీ లేదు. కానీ, తగినంత మేధోమథనం జరిగిన తరువాతే నిర్ణయాలను, ప్రతిపాదనలను వెల్లడిస్తే, గందరగోళానికి ఆస్కారం లేకుండా ఉంటుంది. లేకపోతే, పాత ప్రభుత్వంలోని జాడ్యాలే పునరావృతమవుతున్నాయన్న అభిప్రాయం ఏర్పడుతుంది! కూల్చివేతలు, పునర్నిర్మాణాలు వంటి వార్తలు వింటున్నప్పుడు ఏదో అనౌచిత్యం ధ్వనిస్తోంది!

వెనువెంటనే విమర్శల వర్షం కురిపిస్తే, పెద్ద అపచారమేమీ కాదు, ఆయా నిర్దిష్ట నిర్ణయాలకు, ఘటనలకు సంబంధించి విమర్శ చేయవలసిందే. కానీ, విధానాలే ఇంకా రూపొందనప్పుడు, ప్రభుత్వమే ఇంకా కుదురుకోనప్పుడు మొత్తాన్నే విమర్శించే పనిని ప్రజలు పెద్దగా హర్షించరు. డిసెంబర్ 3 తరువాత ఎవరి ఒత్తిడులు వారికి ఏర్పడ్డాయి. ప్రభుత్వంలోకి వచ్చినవారికి కూడా నల్లేరు నడక లేదు. ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడానికే పెద్ద ప్రయాస కావాలి. వాగ్దానాలు భారీవి, కర్తవ్యాలు పెద్దవి. ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కూడా గమనం కష్టతరమైనదే. తన ఉనికిని నిలబెట్టుకోవాలి. త్వరలో రానున్న ఎన్నికల నాటికి తనను తాను మెరుగుపరచుకోవాలి. తన పొరపాట్లను సమీక్షించుకుంటేనే కొత్త ప్రభుత్వాన్ని విమర్శించగలిగే నైతికత సమకూరుతుంది.

**(ఆంధ్రజ్యోతి 14, డిసెంబర్ 2023 సౌజన్యంతో...)**

# రేపు నీది కాదు

**"గడిచిన నిన్నటికీ, రాబోయే రేపటికీ లంగరందదు. రెండూ కాలప్రవాహానికి రెండు దరులు. అద్దరి అద్దరే. ఇద్దరి యిద్దరే. ఆ రెండూ ఏనాడూ కల్సుకోవు. ఈ రోజే నీది. రేపు నీది కాదు"**

ఇది ఉమర్ ఖయ్యాం చెప్పిన జీవిత సత్యం. ఖచ్చితంగా ఈ మాటల్నే కాకున్నా, అతని మాటల సారాంశం మాత్రం ఇదే.

మొదట్లో నాకు ఈ మాటల మీద విశ్వాసం కుదరలేదు. మహాకవి మిర్జా గాలిబ్ చెప్పిందే నిజమనుకొనేవాణ్ణి. ఆయనేమన్నాడంటే–

"నిన్నా, నేడూ ఏమీ సాధించకపోయినా, మనిషి బ్రతుకుతున్నాడంటే, రేపున్నదన్న ఆశతోనే!"

నిజం కాదా?

అయితే ఇప్పుడు ఖయ్యాం, గాలిబ్– వీళ్ళలో ఎవరు గొప్ప? ఎవరు కాదు? అని చెప్పడం నా ఉద్దేశం కాదు; అంత శక్తీ నాకు లేదు. కాదూ, చెప్పాలంటే ఇద్దరూ రైట్ అంటాను.

కాని ఈ రోజు జరిగిన సంఘటన వల్ల ప్రతి క్షణం ఖయ్యాం కవి చెప్పిన మాటలే చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

ఎవరి నుండి ఎలాంటి ఆటంకం కల్గకుండా వ్రాత పూతలతో గడపాలని నిశ్చయించుకుని ట్యూషన్ పిల్లల్ని కూడా శని, ఆదివారాలు రావొద్దని చెప్పేశాను.

నేను పేరు ప్రఖ్యాతులున్న కవిని, రచయితను కాకున్నా, ఆరవ తరగతి చదువుతున్న రోజుల నుండే చీకరి బీకిరి వ్రాతలు వ్రాస్తుండేవాడిని. అప్పట్లో వాటికి "రచనలు" అనిపించుకునే లక్షణాలు లేకున్నా, వ్రాయడం మాత్రం మానలేదు. Practice make a man perfect అన్న సూత్రం ప్రకారం కాలగమనంలో కొద్దోగొప్పో ప్రామాణిక రచనలు సాగించే స్థాయిని సంపాదించుకున్నాను.

పైగా నాది గురువులేని విద్య. మహాకవుల రచనల్ని దీక్షగా చదివి, రచనా రీతుల్ని, మెళకువల్ని ఆకళింపు చేసుకొని, ఎందరో సరస్వతీ మూర్తులకు ఏకలవ్య శిష్యునిగా నన్ను నేను మలుచుకొని సాహితీ వ్యాసంగాన్ని సాగిస్తూ వస్తున్నాను.

నా అభిమాన ప్రక్రియ– కవిత. అంటే వాక్యాల్ని ముక్కలు ముక్కలుగా కత్తిరించి వ్రాయడం కాదు. లేదా వాక్యాలకు వాక్యాలు వ్రాసి కవిత్వమనుకోండని మభ్యపర్చడం కాదు.

Best words arranged in the best order is poetry అని నమ్మేవాణ్ణి; నమ్ముతున్నాను కూడా. ముమ్ముందు కూడా ఇదే నమ్మకం నాది.

కవితల తర్వాత నా అభిమాన ప్రక్రియలు– అడపాదడపా యదార్థ సంఘటనల ఆధారంతో కథలు వ్రాయడం, నవలలు వ్రాయడం.

నా రచనా వ్యాసాంగాన్ని ప్రశాంతంగా రేపు నిర్వహించాలని ఆలోచిస్తూ, ఆ 'రేపు' ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ శుక్రవారం రాత్రి నిదురపోయాను. అసలు ఆ రోజు చాలా చిరాగ్గ గడిచింది. పగలంతా ఎండలు మండించేసాయి. సాయంత్రం 5, 6 గంటల మధ్య కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులతో, గుండెలదిరే వురుములతో, కుండపోతగా వర్షం కురిసింది. ఆ విపరీతమైన గాలివానకూ, ఆ గడగడలకూ, దడదడలకూ అటు విద్యార్థులూ సరిగా పాఠం వినలేకపోయారు; నేనూ సరిగా చెప్పలేకపోయాను.

ఈ ట్యుటోరియల్లో ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెల రెండో వారం నుండి మే 30వ తేదీ వరకు ఎపిఆర్‌జెసి ఎంట్రెన్స్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ క్లాస్ తీసుకుంటాను నేను. సాధారణంగా ఎంట్రెన్స్ పరీక్షలు మే 31న వుంటాయి. కానీ ఈ సంవత్సరం మధ్యంతర ఎన్నికల పుణ్యాన, జూన్ 8కి పొడిగించారు పరీక్షల్ని.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే ఆ సాయంత్రం వర్షం కారణంగా చిరాగ్గా వుండి, కరెంటు పోయి ఇల్లంతా చీకటిగా వుండి, అన్నం కూడా తినాలపించక, ఏవో నాలుగు మెతుకులు తిన్నాననిపించుకొని ప్రక్క మీదికి చేరాను– రేపటి రచనా వ్యాసంగాన్ని తలచుకుంటూ.

ఎప్పుడు నిదుర పట్టిందో తెలియదు. మా ఆవిడ కేకలకు ఉలిక్కిపడి లేచాను. అప్పుడు టైమ్ చూస్తే రాత్రి రెండు గంటలవుతోంది. ఓ ప్రక్కన మా ఆవిడ కండ్ల నీరు గ్రుక్కుకుంటూ నిలబడి ఉంది. ఎదురుగా మాకు తెల్సిన వ్యక్తి నిలబడి ఉన్నాడు. నిదుర మత్తులో ఉన్న నేను అతన్ని కనీసం కూర్చోమని కూడా అనలేదు. కొన్ని కొన్ని సందర్భాల్లో మనిషి మానర్స్ కూడా మరిచిపోతాడేమో!

అతనేమో చెబుతున్నాడు. నాకేం అర్థం కాలేదు. అర్థమైన తర్వాత మాత్రం హతాశుణ్ణయ్యాను. అతని మాటల సారాంశం ఏమిటంటే– మా బంధువు ఒకరు స్వర్గస్థులైనారట!

మా బంధువు చనిపోయినందుకు నాకు నిజంగానే బాధనిపించింది. కానీ, చెప్పడం సభ్యత కాదు కానీ, నన్ను బాధపెట్టిన మరో విషయం– రెపు నేను సాగించాలనుకుంటూ కలలు కన్న రచనా వ్యాసంగం ఆగిపోవడం!!

అదిగో, అప్పుడే ఉమర్ ఖయ్యాం చెప్పిన మాట నిజమనిపించింది. అప్పటి నుండి ఖయ్యాం అనుక్షణం గుర్తుకు వస్తుంటాడు. అతని జీవిత సత్యం చెవుల్లో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఏమి చేస్తున్నా, ఎక్కడికి వెళ్తున్నా, రేపు నీది కాదు... రేపు నీది కాదు.. అంటూ ఖయ్యాం హెచ్చరిస్తున్నట్లే అనిపించుతూ ఉంటుంది.

**(గీటురాయి 5-7-1991 సంచిక నుంచి)**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**